ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 3 జూన్ 2025





'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



సభలో ప్రసంగిస్తున్న 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య

అక్షరం అండగా... ముందడుగు

సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేయాలి

- తిరుమల నగర్‌లోని మిగిలిన సమస్యలు కూడా పరిష్కరిస్తా
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు
- అందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రారంభించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' దోహదం
- ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య అభినందనీయులు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని తిరుమలనగర్ వాసులు 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' సదస్సులో లేవనెత్తిన సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషిచేస్తానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. తిరుమల నగర్ ఆర్య వైశ్య సామాజిక భవనంలో జనవరి 28న 'ఆంధ్రజ్యోతి' 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' సదస్సు నిర్వహించగా, ప్రజలు అనేక సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రజలు లేవనెత్తిన సమస్యల్లో ప్రధానమైనవి పరిష్కారం కావడంతో సోమవారం తిరిగి అదే భవనంలో సభ నిర్వహించడం జరిగింది.



అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంపై సోమవారం ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనాన్ని సభికులకు చూపుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాటి సదస్సులో ప్రజలు లేవనెత్తిన ప్రధాన సమస్యలను 'ఆంధ్రజ్యోతి' చొరవతో సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించారన్నారు. మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తానని పల్లా హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను గుర్తించి అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావడమే కాకుండా...అవి పరిష్కారమయ్యే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య సామాజిక స్పృహ అభినందనీయమన్నారు. స్థానికులు అనధికార డంపింగ్ యార్డు వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని 'అక్షరం అండగా, పరిష్కారమే ... మిగతా 2వ పేజీలో

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా

"పత్రికలు సాధారణంగా ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువెళ్లడం వరకే పరిమితమవుతాయి. అయితే అంతటితో సరిపెట్టకుండా, అవి పరిష్కారం అయ్యేలా చూడాలనే ఉద్దేశం, లక్ష్యంతో 'ఆంధ్రజ్యోతి' ఈ 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ప్రజల సమస్యలే ప్రధాన అజెండాగా 'ఆంధ్రజ్యోతి' ముందుకుసాగుతుంది. అందుకు సహకారం అందించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాము."

- వేమూరి ఆదిత్య, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్



తిరుమలనగర్‌లో నిర్వహించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమంలో పాల్గొన్న నివాసితులు



రాజీవ్ నగర్ నుంచి నగరంలోని రైల్వే స్టేషన్ మీదుగా ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య. చిత్రంలో కార్పొరేటర్ బొండా జగన్, కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, 'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు, తిరుమలనగర్ కాలనీ వాసులు ఉన్నారు. - మరిన్ని ఫొటోలు, వార్తలు 4వ పేజీలో

డబుల్ డెక్కర్ మెట్రో రైలు

దాంతో పాటు నాలుగు వరుసల ఫ్లైఓవర్లు

- డీపీఆర్ తయారీ బాధ్యత బార్సిల్ కంపెనీకి అప్పగింత
- రూ.47.17 లక్షలు కేటాయింపు
- ఎక్కువ స్థలం అవసరమవుతుందంటున్న అధికార వర్గాలు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):

విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి కీలకమైన అడుగుపడింది. ఇంతవరకూ దీనికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారుకాలేదు. గతంలో నిర్ణయించిన ప్రకారం కాకుండా కొత్తగా ఈ ప్రభుత్వం ఆలోచన చేయడంతో దానికి తగ్గట్టు డీపీఆర్ రూపొందించాల్సి వచ్చింది. ఈ బాధ్యతను సికింద్రాబాద్‌కు చెందిన బార్సిల్ కంపెనీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖ నగర ప్రజలకు ఉన్న అనుమానాలకు ఈ నిర్ణయం ద్వారా కొంత స్పష్టత వచ్చింది. విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టులో డబుల్ డెక్కర్ రైలుతో పాటు నాలుగు వరుసల ఫ్లైఓవర్ల నిర్మాణానికి అనువుగా డీపీఆర్ తయారుచేయాలని ప్రభుత్వం బార్సిల్ సంస్థను ఆదేశించింది.

విశాఖపట్నంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. నగరంలో సుమారు 11 ఫ్లైఓవర్ల నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ ఇంతకు ముందే డీపీఆర్ తయారుచేసి కేంద్రం నుంచి అనుమతి తీసుకుంది. అయితే నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉన్నందున ఫ్లైఓవర్లు నిర్మిస్తే అనుసంధానం చేయడం కష్టమవుతుందని, అందువల్ల రెండింటినీ సమన్వయం చేస్తూ డిజైన్ తయారుచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయం వచ్చే జూన్



నాటికి పూర్తవుతుందని భావిస్తున్న నేపథ్యంలో విశాఖ నుంచి అక్కడకు వెళ్లడానికి అనువుగా ట్రాఫిక్‌ను సరిదిద్దాల్సి ఉంది. ఇందుకు ఫ్లైఓవర్లు చాలా అవసరం. అయితే ముందు వాటిని కాకుండా బీచ్‌రోడ్డును, జాతీయ రహదారిని కనెక్ట్ చేస్తూ వీఎంఆర్‌డీఏ ద్వారా మాస్టర్ ప్లాన్ రహదారులు అభివృద్ధి చేస్తున్నారు. అవి అందుబాటులోకి వచ్చినా సరే ఫ్లైఓవర్ల అవసరం ఉందని జిల్లా నాయకులు ఇటీవల గట్టిగా కోరిన నేపథ్యంలో ప్రభుత్వం మెట్రోతో పాటే నాలుగు వరుసల ఫ్లైఓవర్లు నిర్మాణానికి డిజైన్ రూపొందించాల్సిందిగా కోరడం గమనార్హం. అయితే సిటీ మధ్యలో స్తంభాలు వేసి మెట్రో రైలు నడపడం వరకు బాగానే ఉంటుంది కానీ అదే ... మిగతా 2వ పేజీలో

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అదుర్స్

- నగర విద్యార్థికి ఓబీసీ కేటగిరీలో ఫస్ట్ ర్యాంకు
- ఓపెన్ కేటగిరీలో 18, 26, 78, 116, 118, 132, 216, 278, 279, 284, 334 ర్యాంకులు



జ్ఞాన రుత్విక్‌సాయి, 18వ ర్యాంకు



పి.హేమసాయి సూర్యకార్తీక్, 26వ ర్యాంకు



కె.రసజ్ఞ, 78వ ర్యాంకు



తాళాబత్తుల మనోహర్ 116వ ర్యాంకు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):

ఐఐటీ, తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం గత నెల నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో నగరంలోని పలు విద్యా సంస్థల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచారు. శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ విద్యార్థి డి.జ్ఞాన రుత్విక్‌సాయి 360కి 310 మార్కులు తెచ్చుకుని ఓబీసీ కేటగిరీలో జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు సాధించాడు. నగరంలో చదువుకున్న విద్యార్థికి నాలుగేళ్ల తరువాత ఓబీసీ కేటగిరీలో ప్రథమ ర్యాంకు రావడం విశేషం. అన్ని కేటగిరీల్లో కలిపి సుమారు 500 మందికిపైగా మంచి ర్యాంకులు సాధించారు. జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో పి.హేమసాయి సూర్యకార్తీక్ 26వ ర్యాంకు (ఓబీసీలో 4), కె.రసజ్ఞ 78వ ర్యాంకు (ఓబీసీలో 8), తాళాబత్తుల మనోహర్ 116వ ర్యాంకు (ఓబీసీలో 15), పి.టి.ఆనందచక్రవర్తి 118వ ర్యాంకు, ఎం.పూర్ణసాయి 132వ ర్యాంకు, బి.విక్రమ రాజా 216 (ఓబీసీలో 30), ఎ.సాత్విక్ 278వ ర్యాంకు, పి.ఆదిశిష్ట సుబ్రహ్మణ్యం 279వ ర్యాంకు, జె.యోగేశ్వర్ 284 (ఓబీసీలో 40), పీవీ సూర్య వినయ్ 334, పొట్నూరు కార్తీక్ 419వ ర్యాంకు, డి.సాయిధర్మ ప్రతాప్ 432వ ర్యాంకు, కేవీ అరవింద్‌కుమార్ 442వ ర్యాంకు, ఎస్.నిర్మిత్ 447, బి.మహంతో 461వ ర్యాంకు, ఆర్.కార్తీక్ 526, కె.చరణ్‌రాజు 547, బి.మహిత్ 551, టి.గౌతమ్ విజయకాశ్యప్ 557, డి.బలరాంనాయుడు 633వ ర్యాంకు, బి.రోహిత్‌దత్తా 657వ ర్యాంకు, ఎం.పవన్ కుమార్‌నాయుడు 750వ ర్యాంకు, ఎస్.హరిచరణ్ 799వ ర్యాంకు, ఎల్.చరణ్‌సాయి 963వ ర్యాంకు సాధించారు. ఇంకా ఓబీసీ కేటగిరీలో కె.నవదీప్‌రాజుకు 31వ ర్యాంకు, తారక్‌రామ్‌కు 151వ ర్యాంకు వచ్చాయి. శ్రీచైతన్య, నారాయణ ఐఐటీ అకాడమీ, అసెంట్, శ్రీవిశ్వ విద్యాసంస్థల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు.

స్టీల్ ప్లాంటును కాపాడడమే ధ్యేయం

- మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిస్తేనే లాభాలు
- ఉద్యోగులు ఆత్మవిమర్శ చేసుకోవాలి
- కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు
- గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):



సభలో ప్రసంగిస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

స్టీల్ ప్లాంటును కాపాడడమే తన ధ్యేయమని, 'ఆర్ కార్డుదారులకు అండగా ఉంటానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టంచేశారు. వడ్లపూడి సమీపాన తిరుమల నగర్‌లో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పల్లా మాట్లాడుతూ స్టీల్ ప్లాంటు 100 శాతం సామర్థ్యంతో నడిస్తేనే లాభాలు వస్తాయని, మనుగడ సాగిస్తుందన్నారు. 2024లో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి ప్లాంటు కేవలం 20 శాతం ఉత్పత్తి సామర్థ్యంతోనే పనిచేస్తోందన్నారు. ప్లాంటు నడవడానికి నిధులు కావాలని నాడు కోరిన ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.14,100 కోట్లు సాయం చేస్తే ఇంకా టెంట్లు పట్టుకొని వేలాడుతున్నారని విమర్శించారు. చంద్రబాబునాయుడు 1998లో ఒకసారి, 2024లో మరోసారి రెండు సార్లు స్టీల్‌ప్లాంటుకు ఆర్థిక సాయం అందించారన్నారు. ఢిల్లీలో అందరినీ బతిమలాడి రూ.11,440 కోట్లు తేగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరో రూ.2,600 కోట్లు సమకూర్చామన్నారు. ఇదంతా ప్రజల సొమ్ము అని దానికి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్లాంటు వ్యాపారం చేస్తేనే లాభాలు వస్తాయని, అలా చేయాలంటే పూర్తి సామర్థ్యంతో నడపాల్సి ఉంటుందన్నారు. దానికే ఆ నిధులు యాజమాన్యం ఉపయోగిస్తోందన్నారు. ఆ డబ్బును జీతాలకు పంచేసుకుంటే ఇంకో నాలుగేళ్ల తరువాత ప్లాంటును శాశ్వతంగా మూసుకోవలసి ఉంటుందన్నారు. ప్లాంటులో 1,800 ఘోస్ట్ ఉద్యోగులు...అంటే, ఉద్యోగులు ఉండరని, కానీ జీతాల చెల్లింపులు జరిగిపోతున్నాయన్నారు. ఉత్తి పుణ్యానికే జీతాలు ఇవ్వడం ... మిగతా 2వ పేజీలో

తూర్పు సింధూరం



ఆకాశం సోమవారం సాయంత్రం కుంకుమ అద్దినట్టు ఎరుపు రంగులోకి మారింది. ఈ అద్భుత దృశ్యాన్ని నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో అనేకమంది ఫొటోల్లో బంధించారు.

మండే...

- పడమర గాలులతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి
- ఈ వేసవిలో మొదటిసారిగా ఎయిర్‌పోర్టులో 39.4 డిగ్రీలు నమోదు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):

పడమర దిశ నుంచి పొడిగాలులు వీస్తుండడంతో వరుసగా రెండో రోజు కూడా నగరంలో ఎండ ఠారెత్తించింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేడి గాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం సముద్ర గాలులు నగరం వైపు వీచినా వేడి ప్రభావం తగ్గలేదు. ఈ ఏడాది వేసవి సీజన్‌లో తొలిసారిగా ఎయిర్‌పోర్టులో 39.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉండడంతో వర్షాలు కురిసే వాతావరణం లేదని, రానున్న రెండు రోజుల్లో ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ నిపుణుడొకరు పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



బ్యాంకు టర్నోవర్‌ను రూ.3,000 కోట్లకు పెంచేందుకు కృషి

- డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కోన తాతారావు. చిత్రంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పి.గణబాబు, జనసేన నేత శివశంకర్, తదితరులు ఉన్నారు.

-2లో



కైలాసగిరిపై విత్తన బంతులను జల్లుతున్న వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనరు విశ్వనాథన్

విత్తన బంతులతో పర్యావరణ పరిరక్షణ

- 5వ తేదీ నుంచి కైలాసగిరిపై ప్లాస్టిక్ నిషేధం
- వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాలాక్షినగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : విత్తన బంతులతో వనాలను పెంచే అవకాశం ఉందని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అన్నారు. సోమవారం ఆయన కైలాసగిరిపై వీఎంఆర్డీయే, గ్రీన్ క్లైమేట్ ఆధ్వర్యంలో విత్తన బంతులను చల్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో పచ్చదనం మరింత పెంచేందుకు చర్యలు చేపడతున్నట్టు తెలిపారు. పర్యావరణ దినోత్సవం రోజు నుంచి కైలాసగిరిపై పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం చేపడుతున్నట్టు చెప్పారు. అనంతరం కైలాసగిరిపై 20 వేల విత్తన బంతులను జల్లారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనరు విశ్వనాథ్, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ అధికారులు, పలు ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొబ్బరితోట పార్క్‌లో అంధకారం

» కొన్ని నెలలుగా వెలగని లైట్లు » సందర్శకులకు ఇబ్బందులు

భీమునిపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్డు జగ్గా రావుతోట వద్ద ఉన్న కొబ్బరితోట పార్కులో అంధకారం నెలకొంది. నాలుగేళ్ల క్రితం భోగాపురం ఎయిర్ పోర్టు అభివృద్ధి పనుల నేపథ్యంలో అక్కడ తొలగించిన కొబ్బరి చెట్లను ఇక్కడికి తీసుకువచ్చి పార్కుగా తీర్చిదిద్దారు. 2023 మార్చిలో జీ- 20 సదస్సు ఏర్పాట్లలో భాగంగా జీవీఎంసీ అధికారులు పార్కును అందమైన విద్యుత్ లైట్లతో అలంకరించి, బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ లైటింగ్ తాత్కాలికం కాదని, సదస్సు ముగిసినా శాశ్వతంగా ఉండేలా ఏర్పాట్లు చేశామని అధికారులు అప్పట్లో చెప్పారు. కానీ ఆరు నెలలు తిరగక ముందే లైట్లలో కొన్ని మరమ్మతుకు గురయ్యాయి. ప్రస్తుతం ఒక్క లైట్ కూడా వెలగడం లేదు. పార్కు పట్టణానికి దూరంగా ఉండడంతో చీకటిపడిన తరువాత మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు స్పందించి పార్క్‌లో లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చీకట్లో ఉన్న కొబ్బరితోట పార్క్ పరిసరాలు



హనముంతువాక జంక్షన్ వద్ద ర్యాలీలో పాల్గొన్న విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది

సూర్యఘర్ పథకంపై అవగాహన ర్యాలీ

మధురవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం ఆధ్వర్యంలో హనుమంతవాక నుంచి బీచ్ రోడ్డు వరకు సూర్యఘర్ పథకంపై ఆ శాఖాధికారులు, సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్యామ్‌బాబు, ఈఈ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్ ఉండాలన్న లక్ష్యంతో సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మూడు కిలోవాట్లు సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ వేయించుకుంటే ప్రభుత్వం రూ.78000 రాయితీ ఇస్తుందన్నారు. బీసీ కులాలకు అదనంగా రూ.20 వేల రాయితీ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ కిరణ్‌కుమార్, భీమిలి ఈఈ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రేవిడి ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖాధికారులు తెలిపారు. లింగన్నపేట, బుడ్డివలస, బొత్సపేట, బీఆర్ తాళ్లవలస గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు. అలాగే పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా పద్మనాభం, కృష్ణాపురం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం, శేరిఖండం, రెడ్డిపల్లి, పొట్నూరు, రామయ్యపేట, తునివలస, నర్సాపురం, చిన్నాపురం, నేరెళ్లవలస, కొయ్యపేట, మద్ది, విలాస్‌ఖాన్‌పాలెం, బాందేవపురం, విజయరాంపురం, కుర్రపల్లి, బర్లపేట గ్రామాలకు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో అధ్యాపకులు

జేఈఈలో శ్రీవిశ్వ విద్యార్థుల ప్రతిభ

సీతంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డు-2025 ఫలితాల్లో శ్రీ విశ్వ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి మంచి ర్యాంకులు సాధించారని శ్రీ విశ్వ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. వివిధ కేటగిరీలలో బి.నవదీప్ రాజు 31, ఎ.తారక రామ్ 151, హరికేష్ 519, సీహెచ్ వెంకట హేమ వర్ధన్ 592, కె.బాలరామ్ 706, బి.షణ్ముఖనాయుడు 765, యు.జయంత్‌కుమార్ 953, వై.రాజశేఖర్ 1,522, డి.రవిరాజు 1917, పి.నితిష్‌కుమార్ 2,396వ ర్యాంక్ సాధించారని వివరించారు. 1000లోపు ర్యాంకులు ఏడుగురికి, 5000 లోపు 30 మంది, 10 వేల లోపు ర్యాంకులు 52 మంది విద్యార్థులకు వచ్చాయన్నారు. దాదాపు 297 మంది విద్యార్థులు ప్రముఖ ఐఐటీ, నిట్ అండ్ ఐఐఐటీలలో సీట్లు పొందగలరన్నారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని విద్యా సంస్థల చైర్మన్ కె.ధర్మరాజు అభినందించారు.

ఎసెంట్ విద్యార్థుల ప్రతిభ



సత్తారు పూజితకృష్ణ

డాబాగార్డెన్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డు 2025 ఫలితాల్లో ఎసెంట్ విశిష్టతకు నిదర్శనంగా నిలిచిందని అకడమిక్ డైరెక్టర్ తెలిపారు. సత్తారు పూజిత కృష్ణ ఆలిండియా కేటగిరీ (ఆర్‌సీ)లో 2వ ర్యాంకు, 247, 384, 415, 480, 744 వంటి ర్యాంకులను ఎసెంట్ విద్యార్థులు సాధించారన్నారు. 5 వేలలోపు 34 ర్యాంకులు రావడం దీనికి అద్దం పడుతుందన్నారు. దీని వెనుక డైరెక్టర్‌లు, అధ్యాపక బృందం కృషి, పట్టుదల ఉన్నాయన్నారు. ప్రతిభను వెలికితీసి అద్భుత విజయాలు సాధించడం ఎసెంట్‌కి ఆనవాయితీగా మారిందన్నారు.

విశాఖలో మహిళల వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ కప్ మహిళల క్రికెట్ టోర్నీకి విశాఖ ఆతిథ్యం ఇవ్వనుంది. సెప్టెంబరు 30 నుంచి జరిగే ఈ టోర్నీలో ఒక మ్యాచ్ విశాఖలో జరగనుంది. మహిళల క్రికెట్ టోర్నీకి సంబంధించి బీసీసీఐ సోమవారం ప్రకటించిన వేదికలలో విశాఖకు చోటు లభించింది. బెంగళూరు, గౌహతి, ఇండోర్, కొలంబోతో పాటు విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. షెడ్యూల్‌కు సంబంధించి ప్రారంభోత్సవ మ్యాచ్, సెమీ ఫైనల్స్ ఫైనల్స్ మినహా మిగిలిన మ్యాచ్‌ల తేదీలను ప్రకటించలేదు. దీంతో విశాఖలో జరిగే మ్యాచ్ తేదీ త్వరలో తెలియనుంది.

అప్పన్న సన్నిధిలో గుజరాత్ హైకోర్టు జడ్జి

సింహాచలం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆలయ వైదికులతో కలిసి స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ చేసిన జడ్జి గోత్రనామాలతో అంతరాలయంలో ప్రధానార్చకుడు సీతారామాచార్యులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

సింహాచలం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : అడివివరం గ్రామ దేవత పైడితల్లమ్మ పండగ పురస్కరించుకుని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచనల మేరకు కార్పొరేటర్ కప్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాల్గొనే జట్లకు డ్రా తీశామని, మంగళవారం నుంచి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు 9553023407, 904324931 సెల్ నంబర్లను సంప్రతించాలన్నారు.

రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు

పద్మనాభం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరకుల పంపిణీలో డీలర్లు అక్రమాలకు పాల్పడినా.. అలసత్వం వహించినా చర్యలు తప్పవని తహసీల్దార్ కాకర ఆనందరావు హెచ్చరించారు. సోమవారం ఆయన చిన్నపురంలో రేషన్ సరకుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్లు సమయపాలన పాటించాలని, కార్డుదారులకు సకాలంలో సరకులు అందజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ మురళీ, ఎంఆర్‌ఐ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

మల్కాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణపురంలో ప్రైవేటు బస్సు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అనకాపల్లికి చెందిన నారాయణరావు (30), దిగుమర్తి రామ్మూర్తి (38) విగ్రహాలు తయారు చేస్తుంటారు. సోమవారం మల్కాపురంలో విగ్రహాలు తయారు చేయడానికి వచ్చారు. మధ్యాహ్నం భోజనానికి మల్కాపురం నుంచి శ్రీహరిపురం వైపు బైక్‌పై వెళ్తుండగా ప్రైవేటు బస్సు వెనుక నుంచి ఢీకొంది. దీంతో బైక్ వెనుక కూర్చున్న నారాయణరావు అక్కడికక్కడే మృతి చెందగా రామ్మూర్తి తీవ్రంగా గాయపడ్డాడు.

స్టీల్ ప్లాంటును కాపాడడమే ధ్యేయం

... 1వ పేజీ తరువాయి

ఏ విధంగా సమర్థనీయమో ఆలోచించాలన్నారు. వారు కాకుండా మరో 450 మంది 'యు-కార్డులు' తీసుకొని మస్టర్ వేసి ప్లాంటు నుంచి బయటకు వచ్చేస్తున్నారని, వారికి నెలకు రూ.4.5 కోట్లు వెళుతున్నాయన్నారు. ఈ నష్టాలన్నీ ప్లాంటు భరించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఉద్యోగులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలా చేయకుంటే వారికే నష్టం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని, దానికి సహకారం అందించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులుగా తమపై ఉందన్నారు. 'ఆర్' కార్డుదారులను ఉద్యోగం నుంచి తీసేయడానికి తాము ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించబోమని, వారికి ఎప్పుడు పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

డబుల్ డెక్కర్ మెట్రో రైలు

... 1వ పేజీ తరువాయి

స్తంభాలపై నాలుగు వరుసల ఫ్లైఓవర్లు నిర్మించాలంటే ఎక్కువ స్థలం అవసరమవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ డీపీఆర్‌కు ప్రభుత్వం రూ.47.17 లక్షల బడ్జెట్ కేటాయించింది. మెట్రో రైలు మొదటి దశలో మూడు కారిడార్లకు కలిపి మొత్తం 46.23 కి.మీ. పొడవున ట్రాక్ వేయాలని ఇంతకుముందు ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ నిర్ణయించింది. మలి దశలో కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్రయం వరకూ నాలుగో కారిడార్ నిర్మిస్తారు. తొలి దశ పనులకు రూ.11,498 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 99.8 ఎకరాలు అవసరం కాగా భూసేకరణకు సుమారు రూ.882 కోట్లు నిధులు కావాలని అంచనా వేశారు.

16వ బెటాలియన్ కమాండెంట్‌కు సన్మానం

కొమ్మాది, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : బక్కన్నపాలెం 16వ బెటాలియన్‌లో కమాండెంట్‌గా విధులు నిర్వర్తించిన కేవీ మురళీకృష్ణకు టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బదిలీ కావడంతో బెటాలియన్ అధికారులు, సిబ్బంది సోమవా రం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కాగా మురళీకృష్ణ సోమ వారం విధుల నుంచి రిలీవ్ కాగా ఆయన స్థానంలో శ్రీకాకుళం 1వ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

యోగా నిర్వహణతో నగరానికి అంతర్జాతీయ గుర్తింపు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21న భారీ ఎత్తున నిర్వహించనున్న యోగా వేడుకలతో నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అన్నారు. యోగాంధ్రలో భాగంగా బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో నిర్వహిస్తున్న ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రైనర్స్‌తో కలిసి యోగా సాధన చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులను ఎంపిక చేసి వారికి శిక్షణ అందించాలన్నారు. 15వ తేదీ వరకు వారికి శిక్షణనందించి ట్రైనర్లుగా తీర్చిదిద్దాలన్నారు. దీన్ని ఒక ప్రత్యేక కార్యక్రమంగా రూపొందించి అమలు చేయాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, యోగా విలేజ్ విభాగ అధికారులకు సూచించారు. ప్రధాని మోదీ వేడుకల్లో పాల్గొంటున్నందున విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధనలో పాల్గొన్న వీసీ రాజశేఖర్, తదితరులు

భూసార పరీక్షలతో మేలు

కొండంపూడి కృషి విజ్ఞాన్ కేంద్రం విశాఖ జిల్లా సమన్వయకర్త రాజ్‌కుమార్

పద్మనాభం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే పంటల సాగుపై దృష్టిసారించాలని కొండంపూడి కృషి విజ్ఞాన్ కేంద్రం విశాఖ జిల్లా సమన్వయకర్త ఎన్. రాజ్‌కుమార్ తెలిపారు.సోమవారం ఆయన మద్ది, కోరాడ,విలాస్‌ఖాన్‌పాలెం గ్రామాల్లో జరిగిన వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, దీనివల్ల ఎరువులను ఏ మోతాదులో వాడాలో తెలుస్తుందని చెప్పారు. అనంతరం శాస్త్రవేత్తలు ఎం. వెంకటేష్, కె. కిరణ్ పంటల్లో తెగుళ్ల నివారణ, ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు డాక్టర్ భవానీ, ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ చెరకు సాగులో మెళకవులు, వరిలో సస్యరక్షణ చర్యలపై వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి కె. అప్పలస్వామి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను ప్రతి రైతు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ చలం, భీమిలి ఏఎంసీ చైర్మన్ కోరాడ రామస్వామినాయుడు, మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్‌కుమార్, నాయకులు ఆర్. శ్రీనివాసరవు. కేవీ సత్యనారాయణ, ఏడీఏ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

భీమునిపట్నం,జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కూలి పనులు చేయించుకుని డబ్బులు చెల్లించని యజమాని అపార్టుమెంట్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. జమ్మిచెరువు సమీపంలో ఉన్న ఒక అపార్టుమెంట్‌లో సుమారు 50 మంది కార్మికులు పని చేశారు. మదురవాడ సాయిరాం కాలనీకి చెందిన లక్ష్మణరావు ఆధ్వర్యంలో వారంతా పనులకు వెళ్లారు.పనులు గత ఏడాది ఆగస్టుతో ముగిసాయి. కూలీలకు వేతన బకాయిసుమారు రూ.లక్షా 50 వేలు వరకూ యజమాని చెల్లిం చాల్సి ఉంది. ఎన్నిసార్లు ఫోన్లు చేసినా డబ్బులు ఇవ్వక పోవడంతో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సీటూ నాయకులు అప్పలనాయుడు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో 151వ ర్యాంకు



పద్మనాభం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి గ్రామానికి చెందిన అముజూరు తారకరాం ఐఐటీ అడ్వాన్స్‌లో జాతీయ స్థాయిలో (ఓబీసీ విభాగం) 151వ ర్యాంకు సాధించాడు. ఓపెన్ విభాగంలో జాతీయ స్థాయిలో 936వ ర్యాంకు పొందగా, ఓబీసీ విభాగంలో 151 ర్యాంకు పొందాడు. విద్యార్థి తల్లి ఉమ గృహిణి కాగా, తండ్రి శ్రీను మత్స్యకారుడు. తారకరాం 5 నుంచి 10వ తరగతి వరకే సింహాచలం ఏపీ గురుకుల పాఠశాలలో చదివాడు. పదో తరగతిలో 588 మార్కులు పొంది, శ్రీవిశ్వ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీలో సీబీఎస్ఈ సిలబస్‌పై ఇంటర్‌లో చేరాడు. అక్కడ 474/500 మార్కులు పొందారు. కంప్యూటర్ సైన్స్ చేసి రోబోటిక్ రంగంలో రాణించాలని ఉందని తారకరాం తెలిపాడు. విద్యార్థిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

11 నుంచి స్టూడెంట్ బస్సు పాసుల జారీ

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ బస్సు పాసులను ఈనెల 11వ తేదీ నుంచి జారీ చేసేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 12 నుంచి విద్యా సంస్థలు పునఃప్రారంభం కానుండడంతో అంతకుముందుగానే విద్యార్థులకు పాసులను జారీ చేయాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను కూడా సిద్ధం చేసింది. ద్వారకా బస్ స్టేషన్, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక, ఎంవీపీ బస్ స్టేషన్, మధురవాడ, పెందుర్తి, గాజువాక, కూర్మన్నపాలెం స్టీల్ సిటీ డిపోలో స్టూడెంట్ బస్సు పాస్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయన్నారు.

పాసులు కావాలనుకునే విద్యార్థులు ఏపీఎస్‌ఆర్టీసీపాస్.ఇన్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు, ఫొటోను నమోదు చేసుకోవాలి. సంబంధిత దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకోవాలి. ఆ దరఖాస్తుపై తమ విద్యా సంస్థ ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని తమకు సమీపంలో గల ఆర్టీసీ డిపోకు వెళ్లాలి. దరఖాస్తు ఫారానికి ఆధార్ కార్డు, గత ఏడాది మార్కుల జాబితా జిరాక్స్ కాపీలను జత చేయాలి. ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా రాయాలి.

విద్యా సంస్థలకు సూచన

తరగతుల వారీగా అడ్మిషన్ లిస్టును హెచ్‌ఎం/ప్రిన్సిపాల్ సంతకంతో సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయానికి అందజేయాలి. లేకుంటే ఆయా విద్యా సంస్థల విద్యార్థులకు స్టూడెంట్ రాయితీ బస్సు పాసులను జారీ చేయరు. విద్యార్థుల జాబితాను డిపోలకు అందజేయాల్సిన బాధ్యత విద్యా సంస్థల యాజమాన్యాలదేనని ఆర్ఎం పేర్కొన్నారు. కాగా 12 ఏళ్లలోపు బాలురు, 18 సంవత్సరాలలోపు బాలికలకు ఉచితంగా స్టూడెంట్ జనరల్ బస్సు పాసులను జారీ చేస్తారు. స్టూడెంట్ రాయితీ పాసులకు సంబంధించి మంత్లీ, క్వార్టర్లీ, ఇయర్లీతో పాటు రూట్ పాసులను జారీ చేస్తారు.

చిల్లపేట చెరువు కలుషితం కాకుండా చూడాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి

భీమునిపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిల్లపేట పెద్ద చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు కోరారు. సోమవారం వారు జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువును పార్క్‌గా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉందని, వైసీపీ ప్రభుత్వంలో రూ. 6.50 కోట్లతో అభివృద్ధి పనులు కూడా చేపట్టినట్టు చెప్పారు. ప్రస్తుతం ఈ చెరువులోకి నమ్మివానిపేట, ఆదర్శనగర్, ఎర్రచెరువు, నల్ల కోనేరు నీరు కలవడం వల్ల కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎన్ఆర్ఐ ఆస్పత్రిలోని వ్యర్థాలు చెరువులో కలుస్తుండడంతో విపరీతమైన దుర్వాసన వస్తుందన్నారు. చెరువులో రసాయన వ్యర్థాలు, కాలువల నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిల్ల భాస్కర్‌రెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, కార్మిక సంఘం నాయకులు దల్లి అప్పలరెడ్డి, శివాంజనేయరెడ్డి పాల్గొన్నారు. కాగా పీజీఆర్ఎస్‌కు మొత్తం ఎనిమిది అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 2, ఇంజనీరింగ్ విభాగానికి 3, రెవెన్యూ విభాగానికి 1, ప్రజారోగ్య విభాగానికి 2 వినతులు అందాయి.

అక్షరం అండగా...ముందడుగు

... 1వ పేజీ తరువాయి

అజెండాగా...' కార్యక్రమంలో చెప్పగా, 'ఆంధ్రజ్యోతి' అనేక కోణాల్లో కథనాలు ప్రచురించిందని, దాంతో ఏపీఐఐసీ ఐలా కమిషనర్ స్పందించారన్నారు. యార్డులో చెత్తను వేరొకచోటకు తరలించి, ప్రహరీ గోడ నిర్మించారన్నారు. దీర్ఘకాల సమస్య పరిష్కారమవ్వడంతో స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన కథనాన్ని సభకు హాజరైన వారికి పల్లా శ్రీనివాసరావు చూపించారు. అలాగే తిరుమల నగర్‌కు బస్సు కావాలని ఎప్పటినుంచో అడుగుతున్నాసరే 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమం ద్వారా పరిష్కారమైనందుకు సంతోషంగా ఉందన్నారు. సమాజంలో ఏ సమస్య పరిష్కారం కావాలన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని, 'ఆంధ్రజ్యోతి' ప్రారంభించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమంతో అది సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. సమాజం పట్ల వేమూరి ఆదిత్యకు ఉన్న అవగాహన తనను ఆకట్టుకుందన్నారు. సమాజంలోని దురాచారాలను వెలికితీసి, చైతన్యపరిచే కృషిని కొనసాగించడం ద్వారా మరింత ఎత్తుకు ఎదగాలని అభిలషించారు. సమాజాన్ని గాడిలో పెట్టాలంటే అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీయడంతోపాటు చైతన్యపరచడం, జాగృతపరచడం అవసరమన్నారు. ఆ బాధ్యతను ప్రజలకు గుర్తుచేయడమే కాకుండా వారికి అండగా నిలిచే బాధ్యత తీసుకున్న 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, డైరెక్టర్ వేమూరి ఆదిత్యతోపాటు 'ఆంధ్రజ్యోతి' బృందాన్ని అభినందిస్తున్నానన్నారు.

'ఆంధ్రజ్యోతి' చొరవతో సమస్యల పరిష్కారం: కార్పొరేటర్ జగన్

87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ అనధికార డంపింగ్ యార్డు గురించి తాము అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. కానీ 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమంలో ఈ సమస్యను స్థానికులు లేవనెత్తడంతో ఐలా కమిషనర్ కిషోర్ స్పందించి యార్డులోని చెత్త తరలింపు, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.14 లక్షల వ్యయంతో టెండర్లు పిలిచి, రికార్డు స్థాయిలో మూడు నెలల్లో పనులు పూర్తిచేశారని అభినందించారు. తన వార్డులో గెడ్డల నిర్మాణం కోసం రూ.పది కోట్లు కేటాయింపు జరిగిందన్నారు. సిద్ధార్థ నగర్‌లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గత ప్రభుత్వంలో కుట్ర జరిగితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల వ్యవధిలో దానిని చదును చేయడం జరిగిందని, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. 'ఆంధ్రజ్యోతి' కృషితో రైల్వేస్టేషన్ వరకూ బస్సు సదుపాయం కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. పార్కుల్లో గంజాయి వినియోగం, ఆకతాయిల ఆగడాలకు ఏసీపీ త్రినాథ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి అడ్డుకట్ట వేయడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. లోఓల్టేజీ సమస్య పరిష్కారం కూడా ఆంధ్రజ్యోతి చొరవేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, ఏసీపీ త్రినాథ్, ఐలా కమిషనర్ కిషోర్, ఆర్టీసీ కూర్మన్నపాలెం డిపో ఏడీఎం శ్రీనివాసరావు, ఏపీఈపీడీఏఈ వీర్రాజు, 87వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్. ఎస్. విజయరామరాజు, 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావు, న్యూస్ ఎడిటర్ ఎల్.వి.రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, యాడ్స్ మేనేజర్ కళ్యాణ్‌చక్రవర్తి, సర్క్యులేషన్ ఏసీఎం బి. సత్యనారాయణ, ఆంధ్రజ్యోతి సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి మహేష్, కార్యదర్శి కె.మధుసూదన్ శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



తాతారావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న ఎంపీ శ్రీభరత్, గండి బాబ్జి

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా డీసీసీబీ కార్యకలాపాలను నిర్వహిస్తామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు అన్నారు. నగరంలోని మర్రిపాలెంలో గల డీసీసీబీ కార్యాలయంలో సోమవారం ఆయన పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 14 జిల్లా స్థాయి బ్యాంకులు ఉండగా, వీటిలో ప్రథమ స్థానంలో డీసీసీబీ ఉందన్నారు. భవిష్యత్తులో ఇదే ర్యాంకును కొనసాగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం డీసీసీబీ టర్నోవర్ రూ.2,400 కోట్లు ఉందని, దీనిని రూ.3,000 కోట్లకు పెంచేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతామన్నారు. జాతీయ బ్యాంకులతో పోటీ పడేలా డీసీసీబీ కార్యకలాపాలను కార్యకలాపాలను కొనసాగించడంతో పాటు వినియోగదారులకు మరిన్ని సేవలను అందిందచేందుకు అర్బన్ ప్రాంతంలో ఏటీఎంలను, శాఖలను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో రుణాలను అందించడంతో పాటు వారితో పొదుపు చేయించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని కోన తాతారావు తెలిపారు. అదేవిధంగా రైతుల అభ్యున్నతి కోసం తగిన చర్యలు చేపడతామన్నారు. తాను రాజకీయ నేతనే అయినప్పటికీ డీసీసీబీ కార్యకలాపాల్లో రాజకీయ జోక్యం లేకుండా చూస్తానన్నారు. ముందుగా కోన తాతారావు ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో ప్రతిజ్ఞ చేసి రిజిస్టరులో సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విశాఖ, అనకాపల్లి ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేశ్, మేయర్ పీలా శ్రీనివాసరావు, గాజువాక, పెందుర్తి, ఉత్తర, ఎలమంచిలి, మాడుగుల, చోడవరం, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, పి.విష్ణుకుమార్‌రాజు, ఎస్.విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ రాజు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజుతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

5 నుంచి అమ్మవార్ల వార్షిక మహోత్సవం

బీచ్ రోడ్డు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జాలారిపేట వద్ద ఉన్న పోలమాంబ భూలోక మాత, కొత్తమాంబ అమ్మవార్ల త్రైవార్షిక మహోత్సవాలు ఈనెల 5 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పోతురాజు తెలిపారు. జాలరులు అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. సముద్రంలో వేటకు వెళ్తూ ప్రాణాలు పణంగా పెట్టి జీవనం సాగించే గంగపుత్రుల బతుకులు గాల్లో దీపం వంటివన్నారు. అలాంటి మత్స్యకారులకు కుల దైవంగా భావించే అమ్మవారిని పూజించి వేటకు వెళ్లడం ఆచారంగా వస్తుందన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.20 వేలు విరాళంగా ఇచ్చారని తెలిపారు.

2500 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ఎంవీపీ కాలనీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. కృష్ణా కళాశాల సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఎస్ఐ ధనుంజయనాయుడు తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా, బొలెరో వాహనంలో సుమారు 2,500 కిలోల రేషన్ బియ్యం ఉన్నాయి. ఈమేరకు పౌర సరఫరాల శాఖ ఆర్ఐ మణికంఠ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బొలెరో వాహనం డ్రైవర్ మాడుగుల మోహన్‌కుమార్, వాహన యజమాని సన్నీని అదుపులోకి తీసుకున్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

సిరిపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉద్యోగులు చేసిన సేవలే వారికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తాయని వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ అన్నారు. సోమవారం వీఎంఆర్డీఏలో పదవీ విరమణ చేసిన కార్యనిర్వాహక ఇంజనీర్ జి. శ్యామ్‌సుందర్‌ను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పని చేసి, ప్రతి అంశంలో తనదైన శైలిలో మన్ననలు పొందిన శ్యామ్‌సుందర్ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, బలరామరాజు, ఎస్టేట్ అధికారి దయానిధి, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, డీఎఫ్ఓ సుజాతా శివానీ, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, మధుసూదన్‌రావు, దుర్గాప్రసాద్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైద్య కళాశాలల లీజు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి'

మద్దిలపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో లీజుకు ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లీజుకు ఇవ్వాలని చూస్తున్న 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడపాలని కోరారు. అలాగే ప్రభుత్వ భూములను ఎకరా రూ.100లకు లీజుకు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 15, వంకాయలు (తెలుపు)26,వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 28, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 34 దొండకాయలు 24, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)54, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100,కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

జేఈఈలో మెరిశారు

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో నగరంలోని విద్యార్థులు ప్రతిభ చూపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి, కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారు. శ్రీచైతన్య, నారాయణ ఐఐటీ అకాడమీ, అసెంట్, శ్రీవిశ్వ విద్యా సంస్థల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

రోజూ 15 గంటలు చదివాను



పేరు : మామిడి పూర్ణసాయి
ర్యాంకు : 132వ ర్యాంకు
తండ్రి : శివనాగేశ్వరరావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు
తల్లి : వీణ, ప్రభుత్వ ఉపాధ్యాయిని
లక్ష్యం : కంప్యూటర్ సైన్స్ ముంబైలో జాయిన్ అవుతా. తదుపరి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలని అనుకుంటున్నా. రోజూ 15 గంటలు చదివాను

పక్కా ప్రణాళికతో ముందుకు..



పేరు : ఎ. సాత్విక్
ర్యాంకు : 278వ ర్యాంకు
తండ్రి : సత్యనారాయణ, టీచర్
తల్లి : విజయలక్ష్మి, టీచర్
లక్ష్యం : ముంబైలో సీఎస్ఈలో చేరుతా. భవిష్యత్ ఏం చేయాలని త్వరలో నిర్ణయించుకుంటా.మంచి ర్యాంకు కోసం పక్కా ప్రణాళికతో చదివాను.

ఏఐలో రాణించాలని ఉంది



పేరు : పి. ఆదిశిష్ణు సుబ్రహ్మణ్యం
ర్యాంకు : 279వ ర్యాంకు
తండ్రి : శ్రీరామ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
తల్లి : శిరీష, డాక్టర్
లక్ష్యం : ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ పూర్తయిన తరువాత ఆర్టిఫీషియల్ ఇంటిలెజెన్స్‌లో చేరుతా. అందులో రాణించాలని అనుకుంటున్నా.

ఇంకా మంచి ర్యాంకు వస్తుందనుకున్నా..



పేరు : టి. మనోహర్
ర్యాంకు : 116వ ర్యాంకు
తండ్రి : ప్రసాదరావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు
తల్లి : వీణ, ప్రభుత్వ ఉపాధ్యాయిని
లక్ష్యం : ఇంకా మంచి ర్యాంకు వస్తుందనుకున్నాను. ముంబై ఐఐటీలో సీఎస్ఈలో చేరుతా.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా



పేరు : పి.టి. ఆనందచక్రవర్తి
ర్యాంకు : 118వ ర్యాంకు
తండ్రి : శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు
తల్లి : అనురాధ, ఉపాధ్యాయిని
లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతాను. ఎక్కడ జాయిన్ కావాలన్నది ఇంకా నిర్ణయించుకోలేదు.

నిరంతరం కృషి



పేరు : పి. కార్తీక్
ర్యాంకు : జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 419వ ర్యాంకు
తండ్రి : పి.కాశీరామప్రసాద్ , బిజినెస్
తల్లి : కుమారి ,గృహిణి
లక్ష్యం : ముంబై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌లో చేరుతా.తదుపరి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలని అనుకుంటున్నాను. ర్యాంకు సాధనకు నిరంతరం కృషి చేశాను.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లక్ష్యం



పేరు : డి. మహిత్
ర్యాంకు : 551వ ర్యాంకు
తండ్రి :ఈశ్వరరావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు
తల్లి : పుష్పలత, గృహిణి
లక్ష్యం : చెన్నై ఐఐటీలో సీఈఎస్ చేస్తా. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా.

నారాయణ ప్రభంజనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డీజీఎం డి. హనుమంతరావు

సిరిపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ హాస్టల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్టు ఆ సంస్థ డీజీఎం డి. హనుమంతరావు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో 1000లోపు విద్యార్థులు తాళాబత్తుల మనోహర్ 116వ ర్యాంకు, పి.టి. ఆనందచక్రవర్తి 118వ ర్యాంకు, ఎం. పూర్ణసాయి 132వ ర్యాంకు, ఎ. సాత్విక్ 278వ ర్యాంకు, పి. ఆదిశిష్ణు సుబ్రహ్మణ్యం 279వ ర్యాంకు, పొట్నూరు కార్తీక్ 419వ ర్యాంకు, కేవీ అరవింద్‌కుమార్ 442వ ర్యాంకు, బి.మహిత్ 551వ ర్యాంకు, టి.గౌతమ్ విజయకాశ్యప్ 557, బి.ఈశ్వర్ తనూజ 671వ ర్యాంకు, పి.శ్రీహర్షవర్ధన్ 635వ ర్యాంకు, టి.వి.విష్ణుశ్రీవాత్సవ్ 672వ ర్యాంకు, లక్ష్యజైన్ 741వ ర్యాంకు, బి.చరణ తేజస్వినాయుడు 763వ ర్యాంకు, అచంట పాండే 781వ ర్యాంకు, బి.లక్ష్మీనివాస్ 794వ ర్యాంకు, పి.ప్రశాంత్ కార్తీక్ 807వ ర్యాంకు కైవసం చేసుకున్నారని తెలిపారు. 500 లోపు ఏడుగురు, 100లోపు 17 ర్యాంకులు వచ్చాయన్నారు. అధ్యాపకుల ఎప్పటికప్పుడు విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకొని దానికి అనుగుణంగా బోధించడం వల్ల ర్యాంకులు సాధించడం సాధ్యపడిందన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను డీజీఎం హనుమంతరావు, డీన్స్, ప్రిన్సిపాల్ అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థులకు ర్యాంకులు



ర్యాంకులు పొందిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యా సంస్థల ప్రతినిధులు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీ/తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య విద్యా సంస్థలో చదివిన 350 మంది విద్యార్థులకు ర్యాంకులు వచ్చినట్టు ఏజీఎం కేవీ రమణ తెలిపారు. జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో డి. జ్ఞాన రుత్విక్ సాయి 18వ ర్యాంకు, పి. హేమసాయి సూర్యకార్తీక్ 26వ ర్యాంకు, కె. రసజ్ఞాన 78వ ర్యాంకు, బి. విక్రమ రాజా 216, జే. యోగేశ్వర్ 284,వీవీ. సూర్య వినయ్ 334, డీజీ. సాయిధర్మ ప్రతాప్ 432 వ ర్యాంకు, ఎస్. నిర్మిత్ 447,బి. మహంతో 461వ ర్యాంకు, ఆర్. కార్తీక్ 526 ర్యాంకు, కె. చరణ్‌రాజు 547వ ర్యాంకు, డి. బలరాంనాయుడు 633వ ర్యాంకు, బి. రోహిత్ దత్తా 657వ ర్యాంకు, ఎం. పవన్ కుమార్‌నాయుడు 750వ ర్యాంకు, ఎస్. హరిచరణ్ 799వ ర్యాంకు, ఎల్.చరణ్ సాయి 963వ ర్యాంకు సాధించారన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి సంస్థకుపేరు తెచ్చిన విద్యార్థులకు, ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేసిన బోధన, బోధనేతర సిబ్బందికి, తల్లిదండ్రులకు సంస్థ తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇంకా శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ డీన్లు ఎస్. రఘుకుమార్, కె. బంగారుబాబు కూడా విద్యార్థులను అభినందించారు.

రోడ్డు విస్తరణ నిలిపివేయాలి

ఎమ్మెల్యేకు పాతవెంకోజీపాలెం వాసుల వినతి



ఎమ్మెల్యే వెలగపూడిని కలిసిన గ్రామస్తులు

వెంకోజీపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు వెంకోజీపాలెం నుంచి సీతమ్మధార వరకు అభివృద్ధి పేరిట రోడ్డు విస్తరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఆ ఆలోచన విరమించుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు పాత వెంకోజీపాలెంలోని సీతారామ సేవా సంఘం, రాధాకృష్ణ యాదవ సేవా సంఘం సభ్యులు విన్నవించుకున్నారు. సోమవారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు.1995లో రోడ్డును 40 అడుగులు విస్తరించారని, అప్పట్లో చాలామంది తమ నివాసాలు కోల్పోయారని, రెండేళ్ల క్రితం 60 అడుగులకు విస్తరించగా, మరికొన్ని నివాసాలు దెబ్బతిన్నాయని, ఇప్పుడు 80 అడుగులు చేయాలనే ఆలోచన చేస్తున్నారని దీని వలన అనేక మంది జీవనోపాధి కోల్పోయే దుస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అధికారులతో చర్చించి ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, పీల కోటేశ్వరరావు, సీతారామ సేవా సంఘం, రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ప్రతినిదులు పాల్గొన్నారు.

వికలాంగ పింఛన్ కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా..

కలెక్టర్‌కు మహిళ మొర

మహారాణిపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో వికలాంగుడైన నా భర్తకు పింఛన్ మంజూరు చేయకుండా అధికారులు రెండేళ్లుగా తిప్పుతున్నారని, ఇద్దరు ఆడపిల్లలను, వికలాంగుడైన నా భర్తను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని ఆరిలోవ ప్రాంతానికి చెందిన పెదిరెడ్ల భూలక్ష్మి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి తీవ్రంగా రోదించడం అందరినీ కలచి వేసింది. నాలుగేళ్ల క్రితం తన భర్తకు పక్షవాతం వచ్చి కాళ్లు, చేతులు చచ్చుపడిపోయాయని, ఉన్న సంపాదన వైద్య చికిత్సలకే సరిపోయిందని, కుటుంబ పోషణ భారంగా ఉందని బావురుమంది. భర్తకు వికలాంగుల కోటాలో పింఛన్ వస్తే కొంత ఆసరాగా ఉంటుందని ఆశపడినా అధికారులు సహకరించడం లేదని వాపోయింది. రెండేళ్లగా తిరుగుతున్నా పని కావడంలేదని పేర్కొంది. సోమవారం కలెక్టరేట్‌లో మరోసారి అర్జీ ఇచ్చి బయటకు వచ్చి తీవ్రంగా రోదించింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారిణి రుక్సానా ఆమెను ఓదార్చి ధైర్యం చెప్పి ఇంటికి పంపారు.

పోలీసుల అదుపులో రౌడీ షీటర్ ?

ఎంవీపీ కాలనీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : లాసన్స్‌బే కాలనీలోని శాంతి ఆశ్రమం స్థల వివాదం కేసులో ప్రధాన నిందితుడైన రౌడీ షీటరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొద్ది రోజులుగా ఈ రౌడీ షీటరు పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడు. కమిషనర్ ఈ సంఘటనపై సీరియస్‌గా ఉండడం, రౌడీ షీటర్లను పట్టుకునే బాధ్యతను టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అప్పగించడంతో వారు కొద్ది రోజులుగా రౌడీ షీటర్ల వేటలో ఉన్నారు. ఒక్కొక్కరిని పట్టుకుని ఎంవీపీ పోలీసులకు అప్పగిస్తున్నారు. రౌడీ షీటర్ల బృందానికి నాయకత్వం వహిస్తున్నట్టుగా పేర్కొంటున్న సదరు వ్యక్తి కొద్ది రోజులుగా నగరం వదిలేసి వివిధ ప్రాంతాల్లో చక్కర్లు కొడుతున్నాడు. ఎట్టకేలకు టాస్క్ ఫోర్స్ పోలీసులు సోమవారం అతన్ని ఎంవీపీ పోలీసులకు అప్పగించారు.

కాగా స్థల వివాదంలో తల దూర్చిన రౌడీ షీటర్లందరినీ దాదాపు అరెస్టు చేయగా, వైసీపీ నాయకుడు జీవీ రామచంద్రరావును కూడా అరెస్టు చేశారు. ఇదే కేసులో వైసీపీలో కీలకమైన మహిళా నాయకురాలి పాత్ర కూడా ఉన్నట్టు సమాచారం. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎయిర్‌పోర్టు వద్ద అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడ్ని అడ్డగించిన కేసులో ఆమె నిందితురాలిగా చెబుతున్నారు. ప్రస్తుతం ఆమె కూడా పరారీలో ఉన్నట్టు తెలిసింది.

జీవీఎంసీకి 57 వినతులు : మేయర్

వెంకోజీపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 57 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తితో కలిసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వారం వచ్చిన ఫిర్యాదులు తిరిగి రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన వీఎంఆర్డీఏ చైర్మన్



డీసీసీబీ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన కోన తాతారావును వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్‌గోపాల్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం మద్రిపాలెం దగ్గర ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయానికి వెళ్లి శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. డీసీసీబీ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చాలని కోరారు.

'వెన్నుపోటు దినం విజయవంతం చేయండి'

వెంకోజీపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటుదినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ రాష్ట్ర వాలంటీర్ విభాగం అధ్యక్షులు, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం ఎంవీపీ కాలనీలోని వైసీపీ తూర్పు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాగార్జున మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకి గురైన సంక్షేమ పథకాల లబ్ధిదారులు, వాలంటీర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైసీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, పల్లా దుర్గారావు, విజయచందర్ తదితరులు పాల్గొన్నారు.

'సచివాలయ ఉద్యోగులకు డ్యూటీ లైన్ ఇవ్వాలి'

మద్దిలపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ఉద్యోగులకు నిర్దిష్టమైన డ్యూటీ లైన్స్ ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. మద్దిలపాలెంలో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ఏ విధమైన డ్యూటీ గైడ్ లైన్స్ కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షన్‌దారులకు బకాయిలు చెల్లించడం లేదన్నారు. వీటిపై ఈ నెల 5న అమరావతిలో నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడో కౌన్సిల్ సమావేశంలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. ఈ నెల 14న ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యలతో కూడిన అజెండాను సమర్పిస్తామన్నారు. అమరావతిలో నిర్వహించే మూడో కౌన్సిల్ సమావేశానికి ఉద్యోగులు అందరు హాజరవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి జగన్మోహనరావు, కోశాధికారి పణిశ్రీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

18వ వార్డులో మేయర్ పర్యటన

ఎంవీపీ కాలనీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నగర మేయర్ పీలా శ్రీనివాసరావు 18వ వార్డులో సోమవారం పర్యటించారు. కార్పొరేటరు గొలగాని మంగవేణిపోలరావు, జీవీఎంసీ అధికారులతో కలసి వార్డులోని వివిధ ప్రాంతాలను సందర్శించారు. వీధి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచాల్సి ఉందని కార్పొరేటరు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. సముద్రతీరంలోని శ్మశాన వాటిక వద్ద పెద్దసంఖ్యలో లారీలతో గృహనిర్మాణ వ్యర్థాలను గుట్టలుగా పోసిన ప్రాంతాన్ని చూపించి, వాటిని తొలగించాలని కోరారు. లారీలు లోపలకు రాకుండా రోడ్డు సమీపంలో గేటు ఏర్పాటుచేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఇకపై ఇక్కడ వ్యర్థాలు వేయకుండా చూడాలని, అలాంటి లారీలను సీజ్ చేసి, జరిమానా విధించాలని సూచించారు. ఏఈ అప్పలనాయుడు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కృష్ణ కళాశాలలో పుస్తకాల పంపిణీ

మద్దిలపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం ప్రిన్సిపాల్ బి.సుజాత పాఠ్య పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించి విద్యను ప్రోత్సహిస్తోందని, ఇందులో భాగంగా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించిందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచడానికి కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సదుపాయాలు కల్పిస్తోందన్నారు. తమ కళాశాలలో ఇప్పటికే 188 అడ్మిషన్లు జరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సన్యాసినాయుడు, ఆర్పీ నాయుడు, మురళీకృష్ణ, బాల మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి : సీపీఐ



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ కార్యకర్తలు

ఆరిలోవ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని సోమవారం చినగదిలి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పేదలకు పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలిచ్చి గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు సహాయం అందించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఐ ఆరిలోవ, మధురవాడ శాఖల ఆధ్వర్యంలో విశాఖ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, జిల్లాకార్యదర్శి ఎస్‌కె రెహమాన్‌లు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల మందికి స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణాలంటూ భారీ ప్రకటనలు చేసి వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. నాయకులు ఎండీ బేగం, దేవుడమ్మ, లక్ష్మణరావు, కాసు బాబు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్చితే ఆర్థిక భారం తగ్గుతుంది

మద్దిలపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పిల్లల్ని చేర్పిస్తే తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుందని డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత అన్నారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పుస్తకాలు, భోజన సదుపాయాలు కల్పించిందన్నారు. పూర్తి స్థాయిలో అధ్యాపకులు కూడా ఉన్నారన్నారు. మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లల కోసం కార్పొరేట్ కళాశాలల్లో రూ.లక్షలు ఫీజులు చెల్లించి ఆర్థిక భారం మోస్తున్నారన్నారు. ప్రైవేట్ కళాశాలలను మించి మెరుగైన సదుపాయాలతో ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయని వివరించారు. విద్యార్థులు సక్రమంగా కళాశాలలకు రానందున ఉత్తీర్ణత తగ్గుతుందన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులు వస్తే శతశాతం ఉత్తీర్ణత సాధిస్తామన్నారు. రోజూ పిల్లలను కళాశాలకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 253 అర్జీలు

మహారాణిపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై విచారణ చేపట్టి మళ్లీ మళ్లీ రాకుండా అధికారులు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి 253 అర్జీలు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ విభాగానికి 93, జీవీఎంసీ 77, పోలీసు 21, ఇతర విభాగాలకు సంబంధించి 62 అర్జీలు ఉన్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులకు కలెక్టర్ నేరుగా ఫోన్ చేసి మాట్లాడుతూ అర్జీలో ప్రస్తావించిన సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేసి పరిష్కరించాలని ఆదేశించారు. పి-4 కార్యక్రమంలో భాగంగా గ్రూప్ 1, గ్రూప్ 2 అధికారులు పేద కుటుంబ (బంగారు కుటుంబం) సభ్యులను దత్తత తీసుకుని వారి పిల్లల విద్య, ఆరోగ్యం, నైపుణ్య శిక్షణకు అవసరమైన సహాయం చేయాలని సూచించారు. ఈ నెల 21న నిర్వహించే యోగాంధ్రను విజయవంతం చేసేందుకు అధికారులంతా నిబద్ధతతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను


కలెక్టర్ కార్యాలయంలో వినతులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, అధికారులు

చేయాలని, పాల్గొన్న వారికి టీ షర్టు, యోగా మ్యాట్ అందించనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు ముందుగా వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భూమి కాజేసిన వారిపై విచారణకు వినతి

తహసీల్దార్‌తో కుమ్మక్కై భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీహెచ్ విజయలక్ష్మి అనే మహిళ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. భీమిలి సమీపంలోని సంగివలస ప్రాంతంలో తాము 66 సెంట్ల భూమిని కొనుగోలు చేశామని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కూడా అయ్యిందని పేర్కొన్నారు. మొక్క శ్రీను అనే వ్యక్తి తహసీల్దార్‌తో కుమ్మక్కై తమ స్థలాన్ని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని వాపోయారు. దీనిపై విచారణజరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

వినతులు వినండహో...

పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని అమలు చేయని భాష్యం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ 50వ వార్డులోని ఆరోగ్య కేంద్రం ప్రైవేట్ భవనంలో ఉందని, భవన నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు ఉన్నందున స్థలం కేటాయించి సొంత భవనం నిర్మించాలని బీజేపీ నాయకుడు కిల్లి శ్రీరామమూర్తి కోరారు. వాహనదారులను తనిఖీల పేరిట పోలీసులు చలానాల రూపంలో జరిమానాలు విధిస్తున్నారని, ఇందువల్ల పేద, మధ్యతరగతి వర్గాలు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

» డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా డీసీసీబీ కార్యకలాపాలను నిర్వహిస్తామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు అన్నారు. నగరంలోని మర్రిపాలెంలో గల డీసీసీబీ కార్యాలయంలో సోమవారం ఆయన పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 14 జిల్లా స్థాయి బ్యాంకులు ఉండగా, వీటిలో ప్రథమ స్థానంలో డీసీసీబీ ఉందన్నారు. భవిష్యత్తులో ఇదే ర్యాంకును కొనసాగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం డీసీసీబీ టర్నోవర్ రూ.2,400 కోట్లు ఉందని, దీనిని రూ.3,000 కోట్లకు పెంచేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతామన్నారు. జాతీయ బ్యాంకులతో పోటీ పడేలా డీసీసీబీ కార్యకలాపాలను కార్యకలాపాలను కొనసాగించడంతో పాటు వినియోగదారులకు మరిన్ని సేవలను అందించేందుకు అర్బన్ ప్రాంతంలో ఏటీఎంలను, శాఖలను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో రుణాలను అందించడంతో పాటు వారితో పొదుపు చేయించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని కోన తాతారావు తెలిపారు. అదేవిధంగా రైతుల అభ్యున్నతి కోసం తగిన చర్యలు చేపడతామన్నారు. తాను రాజకీయ నేతనే అయినప్పటికీ డీసీసీబీ కార్యకలాపాల్లో


కోన తాతారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్, గండి బాబ్జి, చిత్రంలో ఇతర నేతలు

రాజకీయ జోక్యం లేకుండా చూస్తానన్నారు.

ముందుగా కోన తాతారావు ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో ప్రతిజ్ఞ చేసి రిజిస్టరులో సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విశాఖ, అనకాపల్లి ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, మేయర్ పీలా శ్రీనివాసరావు, గాజువాక, పెందుర్తి, విశాఖ ఉత్తర, ఎలమంచిలి, మాడుగుల, చోడవరం, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, పి.విష్ణుకుమార్‌రాజు, ఎస్.విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ రాజు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజుతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కూటమి నాయకులు, తదితరులు కోన తాతారావుకు అభినందనలు తెలిపారు.

ఐటీఐ అభ్యర్థులకు అప్రంటీస్ మేళా రేపు

కంచరపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఈ నెల 4న అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్,జోన్-1 ఉపసంచాలకుడు ఆర్.వి.రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్ ట్రేడులు పాసై 25 ఏళ్లలోపు వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చు. ప్రముఖ కంపెనీ మేథా సర్వో ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,001 వేతనం, ఇతర భత్యాలు చెల్లిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు 4న అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ

సీతమ్మధార, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల పరిరక్షణకు జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ పనిచేస్తుందని జాతీయ చైర్మన్ ఎంవీఎల్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని సింధూర ఫంక్షన్ హాలులో సోమవారం వినియోగదారుల హక్కులపై అవగాహన, కొత్త నియామకాల కార్యక్రమాన్ని చేపట్టారు. వినియోగదారుల హక్కుల కమిషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణను, మెడికల్ అండ్ ఫుడ్ సేఫ్టీకి జాతీయ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ మారెళ్ళ ప్రసాద్, ఏపీ రాష్ట్ర చైర్మన్‌గా బల్ల శ్రీనివాసరావు, ఆపరేషన్స్ అండ్ అల్లరవరీ ఏపీ రాష్ట్ర చైర్మన్‌గా డాక్టర్ అవినాష్ తదితరులను నియమించారు.

విశాఖలో మహిళల వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్

» త్వరలో తేదీ వెల్లడి

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ కప్ మహిళల క్రికెట్ టోర్నీకి విశాఖ ఆతిథ్యం ఇవ్వనుంది. సెప్టెంబరు 30 నుంచి జరిగే ఈ టోర్నీలో ఒక మ్యాచ్ విశాఖలో జరగనుంది. మహిళల క్రికెట్ టోర్నీకి సంబంధించి బీసీసీఐ సోమవారం ప్రకటించిన వేదికలలో విశాఖకు చోటు లభించింది. బెంగళూరు, గౌహతి, ఇండోర్, కొలంబోతో పాటు విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. షెడ్యూల్‌కు సంబంధించి ప్రారంభోత్సవ మ్యాచ్, సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మినహా మిగిలిన మ్యాచ్‌ల తేదీలను ప్రకటించలేదు. దీంతో విశాఖలో జరిగే మ్యాచ్ తేదీ త్వరలో తెలియనుంది.

రైల్వే సిబ్బందికి నూతన గృహవసతి

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు కోస్తా రైల్వే రన్నింగ్ సిబ్బంది కోసం విజయనగరంలో కొత్తగా నిర్మించిన వసతి, బోర్డింగ్ భవనాన్ని డీఆర్ఎం లలిత్ బొహ్రా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రన్నింగ్ సిబ్బంది చేపడుతున్న కీలక విధులను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. నూతన గృహవసతి భవనంలో 32 పడక గదులు ఉన్నాయని, ఆధునిక వంటగది, డైనింగ్‌హాల్ ఏర్పాటు చేయడమే కాకుండా దినపత్రికలు, సేద తీరేందుకు చుట్టూ ఆహ్లాదకర వాతావరణం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, శివ నరేష్, పర్వతం పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



శంకరమఠంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అక్కయ్యపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): శరవణ భవ సంస్థాన్ ఆధ్వర్యంలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం సోమవారం శంకరమఠంలో వైభవంగా జరిగింది. ముందుగా గణపతి పుజ పుణ్యాహవచనంతో ప్రారంభించి మండపారాధన అనంతరం కల్యాణమూర్తులకు స్నపన తిరుమంజనం (అలంకారం) కల్యాణం జరిపించి పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సంస్థాన్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ ఉత్సవానికి కంచి శంకర మఠం వారు అందించిన సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏయూ విశ్రాంత తెలుగు భాషా విభాగాధిపతి, బహుభాషా కోవిదులు వి.సుబ్రహ్మణ్య శాస్త్రి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ రవిరాజు, శంకరమఠం కార్యదర్శి అచ్యుత రామయ్య, గైనకాలజిస్ట్ డాక్టర్ విద్యా సుధ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అర్హత


ప్రశంసాపత్రాలతో చెస్ క్రీడాకారులు

మహారాణిపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా ఓపెన్ చదరంగం (చెస్) పోటీల ఫలితాలను ప్రకటించారు. ఏయూ వేదికగా విశాఖ చెస్ అసోసియేషన్, చైతన్య చెస్ అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఫలితాలను టోర్నమెంట్ డైరెక్టర్ రంగాల బాబూరావు ప్రకటించారు. 235 మంది పాల్గొన్న ఈ పోటీల్లో జి.నైనా, లంకా మార్తాండ, వంశీకృష్ణ, దంపల వెంకటేశ్వరరావులు వరుస నాలుగు స్థానాల్లో నిలిచారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 7 8 తేదీలలో ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు వీరు అర్హత సాధించినట్లు వెల్లడించారు. అక్కడ కూడా మంచి ప్రతిభ కనబరచి జాతీయ పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మణికంఠ, ఎంవీఎస్‌ప్రసాద్, రవితేజ, కృష్ణ మోహన్, భార్గవ్, దుర్గా, క్రీడాకారులు, తల్లి దండ్రులు, కోచ్‌లు పాల్గొన్నారు.

సౌరశక్తి వినియోగంతో విద్యుత్ బిల్లు ఆదా


ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యుత్ ఇంజనీర్లు, సిబ్బంది, వినియోగదారులు

సీతమ్మధార, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల పైకప్పులపై సౌరశక్తి ఫలకాలు అమర్చుకుని విద్యుత్ బిల్లు లేకుండా చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.శ్యాంబాబు పిలుపునిచ్చారు. జీరో బిల్లు నినాదంతో సౌరశక్తి వినియోగ ఆవశ్యకతను వివరిస్తూ సోమవారం జోన్-1 డివిజన్‌లోని సత్యం కూడలి నుంచి పెద్దఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఈ జి.శ్యాంబాబు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ఎవరైతే తమ ఇంటిపై సోలార్ ప్యానెల్స్ పెట్టుకుంటారో వారికి కచ్చితంగా జీరో బిల్లు వస్తుందని, వారు వాడుకోగా మిగిలిన విద్యుత్ యూనిట్‌కు రూ.2.90 వంతున తిరిగి ఆదాయంగా పొందవచ్చన్నారు. ఒక కిలోవాట్ సోలార్ ప్యానెల్ పెట్టుకునేవారికి 120 యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుందని, 2 కిలోవాట్ సోలార్ పెట్టుకుంటే 240 యూనిట్‌లు, మూడో కిలోవాట్ ప్యానెల్స్ పెట్టుకుంటే 360 యూనిట్ల ఉత్పత్తి అవుతుందన్నారు. ఒక కిలోవాట్ సోలార్ ప్యానెల్స్ పెట్టుకునేందుకు రూ.70 వేలు ఖర్చవుతుందని, అయిదు సంవత్సరాల పాటు నిర్వహణ బాధ్యతను సంస్థ చూస్తుందన్నారు. సూర్యరశ్మి ఉచితం, సౌరశక్తి అమూల్యమైనది అంటూ నినదించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ సీతమ్మధార కూడలి నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈ సింహాచలం నాయుడు, ఏడీలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

11 నుంచి విద్యార్థుల బస్‌పాస్‌ల జారీ

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ బస్సు పాసులను ఈ నెల 11వ తేదీ నుంచి జారీ చేసేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 12 నుంచి అన్ని విద్యా సంస్థలు పునఃప్రారంభం కానుండడంతో అంతకుముందుగానే విద్యార్థులకు బస్ పాసులను జారీ చేయాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను కూడా సిద్ధం చేసింది. ద్వారకా బస్ స్టేషన్, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక, ఎంవీపీ బస్ స్టేషన్, మధురవాడ, పెందుర్తి, గాజువాక, కూర్మన్నపాలెం స్టీల్ సిటీ డిపోలో స్టూడెంట్ బస్సు పాస్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయన్నారు.

బస్ పాస్ కావాలంటే..

బస్సు పాసులు కావాలనుకునే విద్యార్థులు ఏపీఎస్ఆర్టీసీపాస్.ఇన్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు, ఫొటోను నమోదు చేసుకోవాలి. సంబంధిత దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకోవాలి. ఆ దరఖాస్తుపై తమ విద్యా సంస్థ ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని తమకు సమీపంలో గల ఆర్టీసీ డిపోకు వెళ్లాలి. దరఖాస్తు ఫారానికి ఆధార్ కార్డు, గత ఏడాది మార్కుల జాబితా జిరాక్స్ కాపీలను జత చేయాలి. ఫోన్‌నంబర్‌ను తప్పనిసరిగా రాయాలి.

విద్యా సంస్థలకు సూచన

తరగతుల వారీగా అడ్మిషన్ లిస్టును హెచ్ఎం/ప్రిన్సిపాల్ సంతకంతో సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయానికి అందజేయాలి. లేకుంటే ఆయా విద్యా సంస్థల విద్యార్థులకు స్టూడెంట్ రాయితీ బస్సు పాసులను జారీ చేయరు. విద్యార్థుల జాబితాను డిపోలకు అందజేయాల్సిన బాధ్యత విద్యా సంస్థల యాజమాన్యాలదేనని ఆర్ఎం పేర్కొన్నారు. కాగా 12 ఏళ్లలోపు బాలురు, 18 సంవత్సరాలలోపు బాలికలకు ఉచితంగా స్టూడెంట్ జనరల్ బస్సు పాసులను జారీ చేస్తారు. స్టూడెంట్ రాయితీ పాసులకు సంబంధించి మంత్లీ, క్వార్టర్లీ, ఇయర్లీతో పాటు రూట్ పాసులను జారీ చేస్తారు.

ఉత్సాహంగా చెస్ శిబిరం

మురళీనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో నిర్వహిస్తున్న ఉచిత చెస్ శిక్షణ శిబిరంలో బాలలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జూన్ 7 వరకు కొనసాగే ఈ శిబిరంలో మాస్టర్ ఉమాపతి క్రీడలో మెలకువల్ని నేర్పుతున్నారు. రోజూ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మురళీనగర్, మాధవధార, కంచరపాలెం ప్రాంతాల నుంచి 72 మంది బాలలు చెస్ నేర్చుకుంటున్నారు. ముగింపు రోజు జూన్ 7న బాలలకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ తెలిపారు.

గెడ్డలో వ్యర్థాల తొలగింపు


బ్లీచింగ్ జల్లుతున్న పారిశుధ్య కార్మికుడు

సీతమ్మధార, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 23వ వార్డులోని చైతన్యనగర్, కనకమ్మ వారి ఆలయం రోడ్డు, మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, జ్యోతి నర్సింగ్ హోమ్ రోడ్డులో పారిశుధ్యంపై సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆయా ప్రాంతాల్లో గెడ్డ కాలువలో చెత్తను బాబ్ కెట్ మిషన్‌తో తొలగించారు. వార్డులో చెత్తను ఎక్కడికక్కడ తొలగించి బ్లీచింగ్ చల్లారు. వర్షం పడితే వ్యర్థాలు రోడ్డుపై పేరుకుపోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు సత్యనారాయణ తెలిపారు.

చిత్రలేఖన విజేతలకు బహుమతులు

అక్కయ్యపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవం నేపథ్యంలో ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు చిత్రలేఖనం, యోగాసనాల పోటీలు జరిగాయి. హెచ్ఎం జయంతి రాధా కుమారి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ ఎంఎస్‌వీ విశ్వనాథం ఈ పోటీలు నిర్వహించారు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీవిశ్వ విద్యార్థుల ప్రతిభ

సీతంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో శ్రీ విశ్వ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి మంచి ర్యాంకులు సాధించారని శ్రీ విశ్వ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. వివిధ కేటగిరీలలో బి.నవదీప్ రాజు 31, ఎ.తారక రామ్ 151, హరికేష్ 519, సీహెచ్ వెంకట హేమ వర్ధన్ 592, కె.బాలరామ్ 706, బి.షణ్ముఖనాయుడు 765, యు.జయంత్‌కుమార్ 953, వై.రాజశేఖర్ 1,522, డి.రవిరాజు 1917, పి.నితిష్‌కుమార్ 2,396వ ర్యాంక్ సాధించారని వివరించారు. 1000లోపు ర్యాంకులు ఏడుగురికి, 5000 లోపు 30 మంది, 10 వేల లోపు ర్యాంకులు 52 మంది విద్యార్థులకు వచ్చాయన్నారు. 297 మంది విద్యార్థులు ప్రముఖ ఐఐటీ, నిట్ అండ్ ఐఐఐటీలలో సీట్లు పొందగలరన్నారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని విద్యాసంస్థల చైర్మన్ కె.ధర్మరాజు అభినందించారు.


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సత్తా చాటిన ఎసెంట్ విద్యార్థులు

డాబాగార్డెన్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో ఎసెంట్ విశిష్టతకు నిదర్శనంగా నిలిచిందని అకడమిక్ డైరెక్టర్ తెలిపారు. సత్తారు పూజిత కృష్ణ ఆలిండియా కేటగిరీ (ఆర్‌సీ)లో 2వ ర్యాంకు, 247, 384, 415, 480, 744 వంటి ర్యాంకులను ఎసెంట్ విద్యార్థులు సాధించారన్నారు. 5 వేలలోపు 34 ర్యాంకులు రావడం దీనికి అద్దం పడుతుందన్నారు. దీని వెనుక డైరెక్టర్‌లు, అధ్యాపక బృందం కృషి, పట్టుదల ఉన్నాయన్నారు. ప్రతిభను వెలికితీసి అద్భుత విజయాలు సాధించడం ఎసెంట్‌కి అనవాయితీగా మారిందన్నారు.

వైసీపీ బహిరంగ చర్చకు సిద్ధమా?

అక్కయ్యపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ లేదా ఆయన మద్దతుదారులు అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వ తీరుపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు, ప్రజలకు ఎన్నో హామీలిచ్చి, ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించారే తప్ప హామీలు నెరవేర్చలేదన్నారు. వెన్నుపోటు దినానికి పిలుపునివ్వడం ఆక్షేపణీయమన్నారు.

కోడి వ్యర్థాల రవాణాపై చర్యలకు డిమాండ్

డాబాగార్డెన్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకర కోడి వ్యర్థాల రవాణాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ ప్రజారోగ్య అధికారుల ప్రమేయాన్ని నిరోధించాలని కోరుతూ జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎం.ఎన్. హరేంధర్ ప్రసాద్, నగర మేయర్‌కు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న జరిగే కౌన్సిల్‌లో కోడి వ్యర్థాల రవాణా, అక్రమాలపై చర్చ జరగాలన్నారు. కోడి వ్యర్థాలు వినియోగించిన చేపల చెరువుల నుంచి చేపలను తిన్న వారికి ఉదర, కిడ్నీ సంబంధిత వ్యాధులు వస్తాయని లేఖలో హెచ్చరించారు. ఈ అక్రమాల వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చ తెస్తుందని పేర్కొన్నారు.

పలు రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు రైళ్లకు ఈ నెలాఖరు వరకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 30 వరకు విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు (18526/18525) రెండు జనరల్ సెకండ్ సీటు కోచ్‌లు, విశాఖ భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22820/22819) రెండు జనరల్ సీటు కోచ్‌లు, విశాఖ -కొరాపుట్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18512/18511) రెండు జనరల్ సెకండ్ సీటు కోచ్‌లు, విశాఖ-రాయపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (58528/58527) ఒక జనరల్ సెకండ్ సీటు కోచ్‌లు, విశాఖ-కొరాపుట్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58538/58537) జనరల్ సెకండ్ సీటు కోచ్, విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58532/58531) ఒక జనరల్ సీటు కోచ్, విశాఖ-భవానిపట్న-విశాఖ పాసింజర్ రైళ్లకు (58504/58503) ఒక జనరల్ సీటు కోచ్, విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58506/58505) ఒక జనరల్ సీటు కోచ్ జత చేశామని చెప్పారు.

డబుల్ డెక్కర్ మెట్రో రైలు

(1వ పేజీ తరువాయి)

స్తంభాలపై నాలుగు వరుసల ఫ్లైఓవర్లు నిర్మించాలంటే ఎక్కువ స్థలం అవసరమవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ డీపీఆర్‌కు ప్రభుత్వం రూ.47.17 లక్షల బడ్జెట్ కేటాయించింది.

మెట్రో రైలు మొదటి దశలో మూడు కారిడార్లకు కలిపి మొత్తం 46.23 కి.మీ. పొడవున ట్రాక్ వేయాలని ఇంతకుముందు ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ నిర్ణయించింది. మలి దశలో కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్రయం వరకూ నాలుగో కారిడార్ నిర్మిస్తారు. తొలి దశ పనులకు రూ.11,498 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 99.8 ఎకరాలు అవసరం కాగా భూసేకరణకు సుమారు రూ.882 కోట్లు నిధులు కావాలని అంచనా వేశారు.

స్టీల్ ప్లాంటును కాపాడడమే ధ్యేయం

(1వ పేజీ తరువాయి)

ఏ విధంగా సమర్థనీయమో ఆలోచించాలన్నారు. వారు కాకుండా మరో 450 మంది 'యు-కార్డులు' తీసుకొని మస్టర్ వేసి ప్లాంటు నుంచి బయటకు వచ్చేస్తున్నారని, వారికి నెలకు రూ.4.5 కోట్లు వెళుతున్నాయన్నారు. ఈ నష్టాలన్నీ ప్లాంటు భరించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఉద్యోగులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలా చేయకుంటే వారికే నష్టం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని, దానికి సహకారం అందించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులుగా తమపై ఉందన్నారు. 'ఆర్' కార్డుదారులను ఉద్యోగం నుంచి తీసేయడానికి తాము ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించబోమని, వారికి ఎప్పుడు పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

అక్షరం అండగా.. ముందడుగు

(1వ పేజీ తరువాయి)

అజెండాగా...' కార్యక్రమంలో చెప్పగా, 'ఆంధ్రజ్యోతి' అనేక కోణాల్లో కథనాలు ప్రచురించిందని, దాంతో ఏపీఐఐసీ ఐలా కమిషనర్ స్పందించారన్నారు. యార్డులో చెత్తను వేరొకచోటకు తరలించి, ప్రహరీ గోడ నిర్మించారన్నారు. దీర్ఘకాల సమస్య పరిష్కారమవ్వడంతో స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన కథనాన్ని సభకు హాజరైన వారికి పల్లా శ్రీనివాసరావు చూపించారు. అలాగే తిరుమల నగర్‌కు బస్సు కావాలని ఎప్పటినుంచో అడుగుతున్నాసరే 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమం ద్వారా పరిష్కారమైనందుకు సంతోషంగా ఉందన్నారు. సమాజంలో ఏ సమస్య పరిష్కారం కావాలన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని, 'ఆంధ్రజ్యోతి' ప్రారంభించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమంతో అది సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. సమాజం పట్ల వేమూరి ఆదిత్యకు ఉన్న అవగాహన తనను ఆకట్టుకుందన్నారు. సమాజంలోని దురాచారాలను వెలికితీసి, చైతన్యపరిచే కృషిని కొనసాగించడం ద్వారా మరింత ఎత్తుకు ఎదగాలని అభిలషించారు. సమాజాన్ని గాడిలో పెట్టాలంటే అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీయడంతోపాటు చైతన్యపరచడం, జాగృతపరచడం అవసరమన్నారు. ఆ బాధ్యతను ప్రజలకు గుర్తుచేయడమే కాకుండా వారికి అండగా నిలిచే బాధ్యత తీసుకున్న 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, డైరెక్టర్ వేమూరి ఆదిత్యతోపాటు 'ఆంధ్రజ్యోతి' బృందాన్ని అభినందిస్తున్నానన్నారు.

'ఆంధ్రజ్యోతి' చొరవతో సమస్యల పరిష్కారం: కార్పొరేటర్ బొండా జగన్

87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ అనధికార డంపింగ్ యార్డు గురించి తాము అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. కానీ 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమంలో ఈ సమస్యను స్థానికులు లేవనెత్తడంతో ఐలా కమిషనర్ కిషోర్ స్పందించి యార్డులోని చెత్త తరలింపు, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.14 లక్షల వ్యయంతో టెండర్లు పిలిచి, రికార్డు స్థాయిలో మూడు నెలల్లో పనులు పూర్తిచేశారని అభినందించారు. తన వార్డులో గెడ్డల నిర్మాణం కోసం రూ.పది కోట్లు కేటాయింపు జరిగిందన్నారు. సిద్ధార్థ నగర్‌లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గత ప్రభుత్వంలో కుట్ర జరిగితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల వ్యవధిలో దానిని చదును చేయడం జరిగిందని, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. 'ఆంధ్రజ్యోతి' కృషితో రైల్వేస్టేషన్ వరకూ బస్సు సదుపాయం కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. పార్కుల్లో గంజాయి వినియోగం, ఆకతాయిల ఆగడాలకు ఏసీపీ త్రినాథ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అడ్డుకట్ట వేయడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. లోఓల్టేజీ సమస్య పరిష్కారం కూడా ఆంధ్రజ్యోతి చొరవేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, ఏసీపీ త్రినాథ్, ఐలా కమిషనర్ కిషోర్, ఆర్టీసీ కూర్మన్నపాలెం డిపో ఏడీఎం శ్రీనివాసరావు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ వీర్రాజు, 87వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.ఎస్.విజయరామరాజు, 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావు, న్యూస్ ఎడిటర్ ఎల్.వి.రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, యాడ్స్ మేనేజర్ కళ్యాణ్‌చక్రవర్తి, సర్క్యులేషన్ ఏసీఎం బి.సత్యనారాయణ, ఆంధ్రజ్యోతి సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి మహేష్, కార్యదర్శి కె.మధుసూదన్‌శెట్టి, తదితరులు పాల్గొన్నారు.



చైన్ స్నాచర్లు ఆనంద్, శ్రీరాజు (ఫైల్)

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

గాజువాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నేరస్తులను గాజువాక క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను క్రైమ్ ఏడీసీపీ డి.లక్ష్మణరావు సోమవారం నగరంలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గాజువాకలో మే 26వ తేది రాత్రి ఉరుకూటి నూకాలమ్మ అనే మహిళ ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కిటికి దగ్గరకు ఓ వ్యక్తి వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును తెంచుకుని పారిపోయాడు. ఆమె అరుపులకు నిద్రలేచిన కుమారుడు సన్యాసిరావు బయటకు వచ్చి చూడగా పల్సర్ బైకుపై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు పారిపోతున్నట్టు గుర్తించాడు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన క్రైమ్ పోలీసులు గాజువాక పైడిమాంబ కాలనీకి చెందిన చేపల ఆనంద్ (24), గంగవరం ప్రాంతానికి చెందిన కంబాల శ్రీరాజు (22) ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. వీరిని ఆదివారం రాత్రి అరెస్టు చేసి వీరి వద్ద నుంచి రూ.56,250 విలువైన బంగారు గొలుసు, పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఏడీసీపీ తెలిపారు. సమావేశంలో సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ మన్మథరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు జీఎంకు అభినందనలు



జీఎంకు అభినందనలు తెలుపుతున్న స్టీల్‌క్లబ్ కార్యవర్గం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్)గా బాధ్యతలు స్వీకరించిన ఎం.మధుసూదనరావును స్టీల్ క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. స్టీల్ క్లబ్ అధ్యక్షుడిగా ఉంటూ క్లబ్ ప్రగతికి ఎంతో కృషి చేసిన మధుసూదనరావు ఇప్పుడు జీఎంగా రావడం హర్షణీయమని రామకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్లాంటులో ప్రతి ఉద్యోగి సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు డి.వేణుగోపాల్, వై.రవికుమార్, జె.రమేశ్, వీఎస్‌బీ రాజు, ఎం.భువనకిరణ్, ఎం.రఘునందం, బీవీ రమణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యకి మృతి

కూర్మన్నపాలెం,జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం జంక్షన్‌లో గుర్తు తెలియని వ్యక్తి (యాచకుడు) మృతి చెందాడు. ఎత్తు 5.7 అడుగులు, వయస్సు 55 నుంచి 60 ఉంటుంది. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఆచూకీ తెలిస్తే దువ్వాడ సీఐ 94407 96053 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 15, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 28, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 34 దొండకాయలు 24, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)54, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మేయర్ పీలా శ్రీనివాసరావు

88, 88 వార్డుల్లో పర్యటన

కూర్మన్నపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో సోమవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ బొండా జగన్ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను, నెలకొన్న సమస్యలను మేయర్‌కు వివరించారు. సిద్ధార్థ నగర్‌లో స్పోర్ట్స్ స్టేడియానికి, ప్రధాన రహదారులు, గెడ్డల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, వీటి పనుల పూర్తికి కృషి చేయాలని మేయర్‌ను కోరారు. ఎన్టీఆర్ కాలనీ, ఏడుగుళ్ల వద్ద గెడ్డలను పీలా శ్రీనివాసరావు పరిశీలించి పారిశుధ్య కార్మికులతో పూడికతీత పనులు చేయించవద్దని, కాంట్రాక్టు కార్మికులతో చేయించాలన్నారు.



గెడ్డను పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఎంవీవీఎంకే పార్కు అపార్ట్‌మెంటు నుంచి వస్తున్న మురుగు నీటికి సంబంధించి వారికి నోటీసులివ్వాలని ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌కు ఆదేశించారు. కాలువలపై ఉన్న అనధికార బడ్డీలను తొలగించాలని ఏసీపీ వెంకటరావుకు సూచించారు. అనంతరం 88వ వార్డు కార్పొరేటర్ ముత్యాలనాయుడుతో కలిసి దువ్వాడ సెక్టార్-1, సంధ్యానగర్‌లలో కాలువలను మేయర్ పరిశీలించారు. సంధ్యానగర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలను రూపొందించా లని ఇంజనీర్ గోవిందరావును ఆదేశించారు. గెడ్డల్లో పూడిత తీతలను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని జడ్సీ శేషాద్రికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, సూరిశెట్టి పెంటారావు, పరమానందం, విశ్వేశ్వరరావు, సన్యాసిరావు, దానయ్య, కృష్ణ, శ్రీను, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ ఆదిత్యకు ఘన సత్కారం

కూర్మన్నపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీలో గల ఆర్యవైశ్య సామాజిక భవనంలో సోమవారం నిర్వహించిన 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్యను ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కారుమూరి మహేశ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వార్తలుగా ప్రచురించడానికే పరిమితం కాకుండా వాటి పరిష్కారానికి 'ఆంధ్రజ్యోతి' చేస్తున్న ప్రయత్నం అభినందనీయమైనదన్నారు. వేమూరి ఆదిత్యను సత్కరించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కె.మధుసూదనశెట్టి, ములుకూరి వెంకటరమణ, లింగేశ్వరరావు, కేఆర్కే గుప్తా, జి.నానాజీ, ఎం.సూర్యనారాయణ, బి.వెంకటరావు, కె.రామకృష్ణ,శ్రీరాములు,వరహాలశెట్టి,సుజాత,లత,సంధ్య,రత్నమాల,తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాలాజీ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జరగనున్న ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు షీలానగర్ ఎస్‌టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 3 నుంచి 7వ తేది వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు ఆలయ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సాయింత్రం అంకురార్పణంతో మొదలై ఈ బ్రహోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, గురువారం ఉదయం శ్రీవారి పెద్ద శేషవాహన సేవ, సాయింత్రం శ్రీవారి గరుడ వాహన సేవ, శుక్రవారం ఉదయం సూర్య ప్రభవాహన సేవ, సాయింత్రం శ్రీవారి కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణ , శనివారం ఉదయం వసంతోత్సవం , శ్రీవారి చక్రస్నానం తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వీరభద్రరావు తెలిపారు.

సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

గాజువాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్ వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, వీటిని ఏర్పాటు చేసుకునేందుకు వినియోగదారులు ముందుకు రావాలని జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు అన్నారు. సోమవారం గాజువాకలో నిర్వహించిన సోలార్ రూఫ్‌టాప్ అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవాలని సూచించారు.

ఉక్కులో ఈ నెల 238 మంది పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఈ నెలలో 238 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారు. సాధారణంగా జూన్, జూలై నెలల్లో పదవీ విరమణలు ఎక్కువగా ఉంటాయి. కానీ ఈ ఏడాది రికార్డు స్థాయిలో 238 మంది ఉద్యోగులు జూన్‌లో పదవీ విరమణ చేస్తున్నారు. ఒకేసారి ఇంత మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తుండడం ఇదే ప్రథమమని పలువురు పేర్కొంటున్నారు.

యోగా నిర్వహణతో నగరానికి అంతర్జాతీయ గుర్తింపు

» ఏయూ వీసీ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న భారీ ఎత్తున నిర్వహించనున్న యోగా వేడుకలతో విశాఖ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అన్నారు. యోగాంధ్రలో భాగంగా బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో నిర్వహిస్తున్న ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం వీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రైనర్స్‌తో కలిసి ఆయన యోగా సాధన చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులను ఎంపిక చేసి వారికి శిక్షణ అందించాలన్నారు. 15వ తేదీ వరకు వారికి శిక్షణనందించి ట్రైనర్లుగా తీర్చిదిద్దాలన్నారు. దీనిని ఒక ప్రత్యేక కార్యక్రమంగా రూపొందించి అమలు చేయాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, యోగా విలేజ్ విభాగ అధికారులకు సూచించారు. యోగా నిర్వహణతో విశాఖకు మంచిపేరు రానున్నదన్నారు. ప్రధాని మోదీ యోగా వేడుకల్లో పాల్గొంటున్నందున దీనిని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాచ్‌మన్ పై దాడి

కూర్మన్నపాలెం,జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఈ బ్లాకులో ఉన్న లక్కీ షాపింగ్ మాల్ గోడన్‌లో పని చేస్తున్న కార్మికులు మద్యం సేవించి పక్కనేఉన్న ఉషా గార్మెంట్‌లోకు అక్రమంగా చొరబడ్డారు. వాళ్లను అడ్డుకోవడానికి ప్రయత్నించిన వాచ్‌మన్ కోళ్ల రామును విచక్షణా రహితంగా కొట్టారు. సమాచారం తెలుసుకున్న ఉషాగార్మెంట్ యాజమాన్యం దాడికి పాల్పడిన వారి పై దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాము స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు

వేపగుంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా జీవీఎంసీ 89, 95 వార్డుల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని, 90వ వార్డు విమాన్‌నగర్‌లో మురుగునీరు మళ్లించడానికి చర్యలు తీసుకోవాలని, 91వ వార్డు ఆర్.ఆర్.ది.పురంలో బోరులకు మరమ్మతులు చేయాలని తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖలకు పంపించి చర్యలు తీసుకుంటామని జెడ్సీ కే. హైమావతి ఓ ప్రకటనలో తెలియజేశారు.



రాజీవ్ ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు

క్రీడలకు అవసరమైన నిధులను కేంద్రం నుంచి తెస్తా

ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవంలో ఎంపీ ఎంవీ శ్రీభరత్

పెదగంట్యాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గాజువాకను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు, నగరంలో క్రీడా ప్రాంగణాల నిర్మాణం, నిర్వహణకు అవసరమైన నిధులను కేంద్రం నుంచి తెచ్చేందుకు కృషి చేస్తానని ఎంపీ ఎంవీ శ్రీభరత్ అన్నారు. 65వ వార్డు పరిధి వికాస్‌నగర్‌లో రూ.11 కోట్లతో ఆధునీకరించిన రాజీవ్ ఇండోర్ స్టేడియం, కళా వేదికలను, నూతనంగా నిర్మించిన స్విమ్మింగ్‌పూల్‌ను సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో శ్రీభరత్ మాట్లాడుతూ క్రీడా ప్రాంగణాలు, స్టేడియంలను వినియోగించుకోవడంలో స్థానికులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడా ప్రాంగణాలు దోహదపడతాయని పేర్కొన్నారు. యువత, బాలలు సెల్ ఫోన్లలో గేమ్స్ ఆడడం మానేసి స్టేడియంకు వచ్చి క్రీడల్లో పాల్గొంటే ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. రాజీవ్ స్టేడియంలో ప్రత్యేకంగా షటిల్ కోర్టును ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలో పది స్టేడియంలను నిర్మిస్తామన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజీవ్ స్టేడియంలో రూ.5 లక్షల వ్యయంతో ప్రత్యేక స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తామని, తద్వారా స్థానికులకు అంతర్జాతీయ, జాతీయ క్రీడలు చూసే అవకాశం లభిస్తుందన్నారు. స్థానిక క్రీడాకారులతో సొసైటీని ఏర్పాటు చేసి స్విమ్మింగ్ పూల్ నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఉష



డాక్టర్ ఉష

అగనంపూడి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఆస్పత్రిలో సివిల్ సర్జన్ (గైనిక్)గా పనిచేస్తున్న డాక్టర్ ఉషను నియమిస్తూ వైద్య పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ శంకరప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ భారతి పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. ఆమె స్థానంలో డాక్టర్ ఉష బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రిలోని రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని ఆమె 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పాలిటెక్నిక్ ఫలితాల్లో మెరిసిన బెహరా విద్యార్థులు

గోపాలపట్నం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ఫలితాల్లో బెహరా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. విద్యార్థులు 96శాతం మార్కులు సాధించడంతో కళాశాల కార్యదర్శి డాక్టర్ బెహరా విజయ చైతన్య హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అధాపకులు అభినందనలు తెలిపారు

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

పెందుర్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ ప్రమాద బీమా లభించింది. ఇటీవల ద్విచక్రవాహనం అదుపు తప్పి మృతి చెందిన ఇండుగుబిల్లి రాజబాబు అనే కార్యకర్త మృతిచెందడంతో అతని భార్య ఆశాజ్యోతికి రూ.5 లక్షల చెక్కును నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ సోమవారం అందించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వంతో రూ 5లక్షలు బీమాతో పాటు పలు రాయితీలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, వెన్నెల సన్యాసినాయుడు, అన్నంరెడ్డి బంగారునాయుడు, దొడ్డి శ్రీధర్, బంగారయ్య పాల్గొన్నారు.

అందరూ నీతి, నిజాయితీతో జీవించాలి

మల్కాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీలతో జీవించడం వల్ల మనిషి నిర్భయంగా, స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో జీవించగలడని స్థానిక నాయకుడు చింతకాయల వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం బాలల వేసవి శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ నిజాయితిగా ఉండడం వల్ల అధికారం, శక్తి, విశ్వసనీయత వస్తుందని పేర్కొన్నారు. అనంతరం బాలలకు నీతి కథలను చెప్పారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సామాజిక కార్యకర్త ఎం.నాగబాబు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి ప్రముఖుల జీవిత చరిత్రలను చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం శాఖ గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, జాతీయ సేవా పథకం కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, మరొకరికి గాయాలు

మల్కాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణపురంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లికి చెందిన నారాయణరావు (30), దిగుమార్తి రామ్మూర్తి (38) విగ్రహాలను తయారు చేసేవారు. పని నిమిత్తం సోమవారం ఉదయం మల్కాపురంలో విగ్రహాలను తయారు చేయడానికి వచ్చారు. మధ్యాహ్నం భోజనానికి మల్కాపురం నుంచి శ్రీహరిపురం వైపు మోటర్‌బైక్‌పై వెళ్తుండగా ఓ ప్రైవేటు బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో వెనకాల కూర్చున్న నారాయణరావు బస్సు వెనుక చక్రాల కింద పడి మృతి చెందాడు. బండి నడుపుతున్న రామ్మూర్తి తీవ్రంగా గాయపడ్డాడు. రామ్మూర్తిని చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, నారాయణరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఆపరేషన్స్ డైరెక్టర్

వేపగుంట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలో నూతనంగా అప్‌గ్రేడ్ చేసిన 220 కేవీ సబ్ స్టేషన్ పనులను ఆపరేషన్స్ డైరెక్టర్ టీవీ. సూర్యప్రకాషరావు సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న 33 కేవీ లైన్ టేకాఫ్ ఏవిధంగా చేయాలి తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. నగరంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు ఈ అప్‌గ్రేడేషన్ పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ పోలాకి శ్రీనివాసరావు, ఏడీఈ రామునాయుడు, ఏఈలు పద్మనాభం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం,జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88 వార్డు కాపు జగ్గరాజు పేట శివారులో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతదేహాన్ని పకీరుతఖ్యా గ్రామస్థుడు చూసి గాజువాక వీఆర్‌ఓ అప్పలరాజుకు సమాచారం అందించారు. వీఆర్‌ఓ ఘటనా స్థలికి చేరుకుని మృతుని గురించి సమీప గ్రామాల్లో వాకబు చేసిన ఫలితం లేకుండా పోయింది. మృతుడి వయస్సు 42-45 మధ్య ఉంటుందని, కుడి చేతిపై ఎస్‌హెచ్ఎల్‌వీ అని రాసి ఉందని, నీలం గళ్ల చొక్కా, నీలం రంగు ఫ్యాంట్ ధరించాడని పోలీసులకు వీఆర్‌వో వివరాలు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆచూకీ తెలిస్తే 9440796053 నెంబరుకు సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

'శ్రీచైతన్య' విద్యార్థులకు ర్యాంకులు



ర్యాంకులు పొందిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యా సంస్థల ప్రతినిధులు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీ/తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య విద్యా సంస్థలో చదివిన 350 మంది విద్యార్థులకు ర్యాంకులు వచ్చినట్టు ఏజీఎం కేవీ రమణ తెలిపారు. జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో డి. జ్ఞాన రుత్విక్ సాయి 18వ ర్యాంకు, పి. హేమసాయి సూర్యకార్తీక్ 26వ ర్యాంకు, కె.రసజ్ఞాన 78వ ర్యాంకు, బి. విక్రమ రాజా 216, జే. యోగేశ్వర్ 284,పీవీ. సూర్య వినయ్ 334, డీజీ. సాయిధర్మ ప్రతాప్ 432 వ ర్యాంకు, ఎస్. నిర్మిత్ 447,బి. మహంతో 461వ ర్యాంకు, ఆర్. కార్తీక్ 526 ర్యాంకు, కె. చరణ్‌రాజు 547వ ర్యాంకు, డి. బలరాంనాయుడు 633వ ర్యాంకు, బి. రోహిత్ దత్తా 657వ ర్యాంకు, ఎం. పవన్ కుమార్‌నాయుడు 750వ ర్యాంకు, ఎస్. హరిచరణ్ 799వ ర్యాంకు, ఎల్.చరణ్‌సాయి 963వ ర్యాంకు సాధించారన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి సంస్థకుపేరు తెచ్చిన విద్యార్థులకు, ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేసిన బోధన, బోధరేతర సిబ్బందికి, తల్లిదండ్రులకు సంస్థ తరఫున ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇంకా శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ డీన్లు ఎస్.రఘుకుమార్, కె. బంగారుబాబు కూడా విద్యార్థులను అభినందించారు.

'అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

మల్కాపురం,జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్ల కోసం డీడీల చెల్లించిన వారికి వెంటనే ఇళ్లను కేటాయించాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం ములగాడ తహశీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ 'పశ్చిమ' కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. అర్హులకు ఇళ్ల స్థలాన్ని ఇవ్వడంతో పాటు, ఇంటిని నిర్మించేకొనేందుకు రూ.5 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ భుజంగరావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

మార్కెట్ నియమాలపై రైతులు, వర్తకులకు అవగాహన



రైతులకు వర్తకులకు సూచనలిస్తున్న ఎస్టేట్ అధికారి ప్రసాద్

గోపాలపట్నం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుబజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్ సోమవారం అగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు, వర్తకులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. పట్టికలో ఉన్న ధరలకే కూరగాయలను విక్రయించాలని సూచించారు. పండ్లను మగ్గబెట్టే సమయంలో రసాయనాలు వినియోగించకుండా ఉద్యాన శాఖ అధికారులు సూచించిన పద్ధతులను అనుసరించాలని వివరించారు. బజారులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలని, వ్యర్థలను చెత్తబుట్టల్లో మాత్రమే వేయాలని ఆయన ఆదేశించారు. జేసీ ఆదేశాలనుగుణంగా మార్కెటింగ్ శాఖ అధికారుల నియమ నిబంధనలను రైతులు, వ్యాపారులు తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు.

కోన తాతారావుకు అభినందనలు

మల్కాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్‌గా కోన తాతారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గా ప్రశాంతి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తోందని అన్నారు.

మహిళ అదృశ్యం

పెందుర్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): భార్య అదృశ్యమైందని చింతలఅగ్రహారానికి చెందిన పెంటకోట నరేశ్ పోలీసులను ఆశ్రయించాడు. నరేశ్ గత నెల 25న పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే సరికి భార్య శ్యామల ఇంటిలో కనిపించకపోవడంతో కంగారుపడ్డాడు. ఇంటిలో మొత్తం వెతికి చూసేసరికి రూ.30వేలు నగదు, తులం బంగారు గొలుసు కనిపించ లేదు. దీంతో భార్య ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవకులకు సత్కారం

అగనంపూడి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడిలో గల శ్రీకోదండరామాలయంలో ఆధ్యాత్మిక, పూజాది కార్యక్రమాల నిర్వహణకు సేవతో పాటు సహకారాన్ని అందిస్తున్న టీడీపీ వార్డు నాయకులు గొల్లవిల్లి వెంకటరావు, కనకభవానీ దంపతులను సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎనిమిదేళ్లుగా ఆలయ నిర్వహణకు వారు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మామిడి దేముడు, విందుల ప్రసాద్, అప్పలరాజు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



87వ వార్డు పరిధి తిరుమలనగర్ ఆర్యవైశ్య సామాజిక భవనంలో సోమవారం జరిగిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' సభలో ప్రసంగిస్తున్న 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



పార్కును పరిశీలిస్తున్న 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, పల్లా శ్రీనివాసరావు, తదితరులు



వేమూరి ఆదిత్య, పల్లా శ్రీనివాసరావులను సత్కరించిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు



రాజీవ్ నగర్ నుంచి నగరంలోని రైల్వే స్టేషన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సు సర్వీస్‌ను ప్రారంభించిన అనంతరం అందులో ప్రయాణించి టికెట్ తీసుకుంటున్న 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య. చిత్రంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, కాలనీ వాసులు ఉన్నారు



వేమూరి ఆదిత్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి



'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ ఆదిత్యకు దుశ్శాలువా కప్పుతున్న మురళీ



వేమూరి ఆదిత్యను సత్కరిస్తున్న అర్చకుడు



కణితి ఎంపీపీ పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న పల్లా శ్రీనివాసరావు, వేమూరి ఆదిత్య



రాజీవ్ నగర్-రైల్వే స్టేషన్ బస్సును రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న పల్లా శ్రీనివాసరావు

సమస్యలకు పరిష్కారం చూపిన ఆంధ్రజ్యోతి

ఆనందం వ్యక్తం చేసిన తిరుమలనగర్ వాసులు

ఏళ్లతరబడి తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలకు 'ఆంధ్రజ్యోతి' ద్వారా పరిష్కారం లభించిందని 87వ వార్డు పరిధి వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీలో గల తిరుమలనగర్ ప్రాంత ప్రజలు ఆనందం వెలిబుచ్చారు. సోమవారం ఉదయం తిరుమలనగర్ ఆర్యవైశ్య సామాజిక భవన్‌లో జరిగిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' సభలో పలువురు కాలనీవాసులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. -ఆంధ్రజ్యోతి/కూర్మన్నపాలెం

కాలుష్యం నుంచి విముక్తి లభించింది

- ఎం.పరమానందం, తిరుమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి



తిరుమలనగర్ కాలనీవాసులను దశాబ్దాలుగా వేధించిన కాలుష్యం సమస్యకు పరిష్కారం లభించింది. గాజువాక ఇండస్ట్రియల్ ఎస్టేట్ డంపింగ్ యార్డు తిరుమలనగర్‌ను ఆనుకుని ఉండడం వల్ల తీవ్ర దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడేవారు. డంపింగ్ యార్డుకు నిప్పు పెట్టినప్పుడల్లా వెలువడే పొగ, దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అయ్యేవాళ్లం. ఈ ఏడాది జనవరి 28న తిరుమలనగర్ ఆర్యవైశ్య సామాజిక భవనంలో నిర్వహించిన 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' పేరిట 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమంలో డంపింగ్ యార్డు వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు స్పందించి డంపింగ్ యార్డును తొలగించడమే కాకుండా ఆ స్థలం చుట్టూ చుట్టూ గోడ కట్టడం ఎంతో ఆనందంగా ఉంది.

బస్సు సౌకర్యం కల్పించడం హర్షణీయం

- జి.విశ్వేశ్వరరావు, తిరుమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు



తిరుమలనగర్ కాలనీకి సోమవారం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం లభించడం హర్షణీయం. గతంలో స్టీల్ సిటీ డిపో నుంచి తిరుమలనగర్, రాజీవ్‌నగర్ మీదుగా దువ్వాడ రైల్వే స్టేషన్‌కు, అక్కడ నుంచి తిరిగి తిరుమలనగర్, వడ్లపూడి పాత గాజువాక మీదుగా సింధియా వరకు ఆర్టీసీ ఆర్టీసీ బస్సు ఉండేది. ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉందని ఆర్టీసీ అధికారులు ఆ బస్సును రద్దు చేశారు. 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' పేరిట 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమంలో ఈ అంశాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు స్పందించి సోమవారం నుంచి బస్సును పునః ప్రారంభించారు. తిరుమలనగర్ కాలనీ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ బస్సు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ఆకతాయిలకు చెక్.. ఈ క్రెడిట్ 'ఆంధ్రజ్యోతి'దే..

- శ్రీలక్ష్మి, గృహిణి, తిరుమలనగర్



తిరుమలనగర్ కాలనీ మధ్యలో ఉన్న పార్కులో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉండేది. ఇతర ప్రాంతాల నుంచి ఆకతాయిలు ఇక్కడకు వచ్చి స్థానిక మహిళలు, యువతులపై అసభ్యకరంగా ప్రవర్తించడం, పరిసరాల్లోని ఇళ్లలోకి రాళ్లు రువ్వడం చేసేవారు. 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' పేరిట 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమంలో తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాం. వారు పెట్రోలింగ్‌ను పెంచడంతో పాటు పలువురు ఆకతాయిలను పట్టుకుని వికృత చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాక తరచూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నందున ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట పడింది. ఈ క్రెడిట్ అంతా 'ఆంధ్రజ్యోతి'దే.

పైపు లైన్లను సరిచేశారు.. రోడ్లు వేశారు

- సన్యాసిరావు, తిరుమలనగర్



తిరుమలనగర్ కాలనీకి కొళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేసే పైపు లైన్లకు ఎక్కడికక్కడ లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పారుతూ కాలువల్లో కలిసేది. కాలనీవాసులకు తగినంత తాగునీరు లభించేది కాదు. నీరు లీకైన చోట్ల రోడ్లు గుంతలమయంగా మారేది. 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ఈ సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారు స్పందించి పైపు లైన్లను మార్చడంతో పాటు రహదారులపై గోతులను కూడా పూడ్చారు. మరికొన్ని ప్రాంతాల్లో నూతనంగా రోడ్లు వేశారు. ఇదంతా 'ఆంధ్రజ్యోతి' చలువే.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

-ప్రభావతి, గృహిణి, తిరుమలనగర్



ఎప్పటికప్పుడు లోవోల్టేజీ సమస్య తిరుమలనగర్ కాలనీని వేధించేది. దీనివల్ల ఫ్యాన్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, విద్యుత్ మోటార్లు, గ్రైండర్లు, మిక్సీలు వంటివి పనిచేసేవి కావు. ఒక్కోసారి విద్యుత్ గృహోపకరణాలు పాడైపోయేవి. దీనివల్ల కాలనీవాసులు ఆర్థికంగా నష్టపోయేవారు. ఈ సమస్యను 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లాం. వారు స్పందించి కాలనీలో అదనంగా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో లోవోల్టేజీ సమస్య పరిష్కారమైంది.

'ఆంధ్రజ్యోతి' వల్ల రహదారులకు మోక్షం



'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' పేరిట నిర్వహించిన కార్యక్రమం వల్ల 87వ వార్డు పరిధిలోని పలు రహదారులకు మోక్షం లభించింది. గతంలో వార్డులోని అనేక రోడ్లు గోతులమయంగా ఉండేవి. యూజీడీ లైన్ల కోసం రహదారులను ఎక్కడికక్కడ తవ్వేసి అలాగే వదిలేయడంతో గోతులుగా మారాయి. పాదచారులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారు త్వరితంగా స్పందించి వీధి రోడ్లతోపాటు కొన్ని ప్రధాన రహదారులను వేశారు. ఇందుకు 'ఆంధ్రజ్యోతి' టీడీపీ నాయకుల కృషే కారణం.

- ఎస్ఎస్ విజయరామరాజు,
టీడీపీ 87వ వార్డు అధ్యక్షుడు



ఆదిత్యను సత్కరించి మొక్క అందజేస్తున్న కార్పొరేటర్ బొండా జగన్

వీధిలైట్లన్నీ వెలుగుతున్నాయి



జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని అన్ని వీధి లైట్లు, కూడళ్లలోని హైమాస్ట్ లైట్లు వెలుగుతున్నాయి. ఒకవేళ మరమ్మతులకు గురైనా ఎప్పటికప్పుడు బాగుచేస్తున్నారు. గతంలో ప్రధాన రహదారులు, వీధుల్లో లైట్లు అరకొరగా వెలిగేవి. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఈ మేరకు వారు స్పందించి వీధి లైట్లు, జంక్షన్లలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ ఘనత 'ఆంధ్రజ్యోతి'కే దక్కుతుంది.

- బి.రాజాన రాజు, టీడీపీ సీనియర్ నాయకుడు

జూలై 2 నుంచి క్రూయిజర్ షిప్

విశాఖ టు చెన్నై వయా పాండిచ్చేరి

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పోర్టులో రూ.100 కోట్లతో టెర్మినల్ నిర్మించిన తరువాత దేశీయ క్రూయిజర్ కార్డిలియా మొదటి షిప్‌గా వస్తోంది. కార్డిలియా క్రూయిజర్ విశాఖపట్నం నుంచి పాండిచ్చేరి మీదుగా చెన్నైకు టూర్ షెడ్యూల్ ప్రకటించింది. విశాఖలో జూలై రెండో తేదీ సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి మూడో తేదీ అంతా సముద్రంలో ప్రయాణిస్తుంది. నాలుగో తేదీ ఉదయం ఏడు గంటలకు పాండిచ్చేరి చేరుతుంది. అక్కడ నుంచి రాత్రి ఏడు గంటలకు బయలుదేరి ఐదో తేదీ ఉదయం 8 గంటలకు చెన్నై చేరుతుంది. ఈ విధంగా ఈ క్రూయిజర్ విశాఖపట్నం నుంచి జూలై 2, 9, 16 తేదీల్లో అందుబాటులో ఉంటుంది. విశాఖపట్నం నుంచి చెన్నై వరకు ఈ పర్యాటక నౌకలో వెళ్లేవారు అక్కడ టూర్ ముగించుకొని రైలు లేదా విమానంలో వెనక్కి రావలసి ఉంటుంది. క్రూయిజర్‌లో లైవ్ షోలు, స్విమ్మింగ్ పూల్స్, స్పా, కేసినో, ఇంకా అనేక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. విశాఖపట్నం నుంచి ప్రయాణించేందుకు రెండు వేల మంది ప్రయాణికులకు టికెట్లు కేటాయించారు. ఇతర వివరాలకు 022-64212907 నంబరులో సంప్రతించవచ్చు.

కారుషెడ్ కూడలిలో వైశ్యరాజు జ్యూవెలరీ షోరూమ్ ప్రారంభం

మధురవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కారుషెడ్ కూడలిలో వైశ్యరాజు జ్యూవెలరీ ఏర్పాటు చేసిన తన నూతన షోరూమ్‌ను కొవ్వూరి పుండరీకాంక్షరెడ్డి సోమవారం ప్రారంభించారు. జామి భోజరాజు షోరూమ్‌లో మొదటి వస్తువును కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ ఇప్పటివరకు నగర ప్రజలకు అందుబాటులో ఉన్న తమ షోరూమ్‌ను మధురవాడ పరిసర ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశంతో కారుషెడ్ వద్ద అధునాతన భవనంలో ప్రారంభించామన్నారు. తమ షోరూమ్‌లో 22 కేరెట్ల బంగారు ఆభరణాలను ఆరు శాతం ఫ్లాట్ తరుగుకే వినియోగదారులకు అందిస్తామని తెలిపారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరి లేదన్నారు. జీఎస్‌టీని వినియోగదారుల తరఫున తమ సంస్థే చెల్లిస్తుందన్నారు. కిలో వెండి వస్తువులు కొనుగోలు చేస్తే రూ.12000 డిస్కౌంట్‌ను ప్రారంభ ఆఫర్‌గా ఇస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఆఫర్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూవెలరీ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, డైరెక్టర్లు వైశ్యరాజు నరేశ్, వైశ్యరాజు కిరణ్‌కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న కొవ్వూరి పుండరీకాంక్ష రెడ్డి. చిత్రంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు, తదితరులు ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.60 వేల విలువ చేసే గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మర్రిపాలెం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయం ఒడిశాకు చెందిన ఈశ్వర్ కాముడి (21) అనే యువకుడు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.